RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY | తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 98 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, అక్టోబర్,5, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 98 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,October,5, 2025 | PAGES : 8 RS : 4 /- |




## గాజాలో శాంతికి మార్గం సుగమం

### హమాస్ ప్రకటనపై ప్రపంచ దేశాల హర్షం

- ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు హమాస్ అంగీకారం

ఢిల్లీ,: గాజాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంక్షోభానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు అంగీకరిస్తున్నట్లు హమాస్ ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. తమ వద్ద ఉన్న బందీలందరినీ విడుదల చేస్తామని, గాజా పరిపాలన బాధ్యతలను స్వతంత్ర నిపుణులకు (టెక్నోక్రాట్లకు) అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. హమాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



## ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

- శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సిఎం నితీశ్ కుమార్




న్యూఢిల్లీ, :ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామి క విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారత కు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణిం చారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకి స్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచిం చారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత- కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు.ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు.



## జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకైచి

### ఆమె ఎన్నికల లాంఛనమే అంటున్న పరిశీలకులు

న్యూఢిల్లీ, : జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు.తాజా రాజకీయ పరిస్తితుల్లో ఆమె ఎన్నిక లాంఛనమే కానుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఈక్రమంలో తదుపరి ప్రధానిగా తకైచి బాధ్యతలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది.





## అమెరికాలో దుండగుడి కాల్పులు

### హైదరాబాద్ విద్యార్థి చంద్రశేఖర్ మృతి

### సిఎం రేవంత్ దిగ్భ్రాంతి.. హరీష్ రావు పరామర్శ

**హైదరాబాద్,,తెలంగాణ దిశ :** అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో తెలుగు వ్యక్తి ప్రాణాలు కోల్పోయా డు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్, మీర్‌పేట్ టీచర్స్ కాలనీకి చెందిన 35 ఏళ్ల పోలె చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



## ఎర్రగడ్డ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

### జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో గెలిపించాలన్న పొన్నం


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఎలా గెలిపించారో.. జూబ్లీహిల్స్ లోనూ గెలిపించాలని కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్ధేశం చేశారు . జూబ్లీహిల్స్ అభివృద్ధి ముఖ్యమంత్రి తీసుకున్నా రని.. కాంగ్రెస్ కు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనీ ఎర్రగడ్డ డివిజన్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొ న్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎర్రగడ్డ డివిజన్ లోని 2.16 కోట్ల రూపాయల వ్యయ ంతో నటరాజ్ నగర్, శంకర్‌లాల్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్ వద్ద అఅ రోడ్లు వేయడం / నటరాజ్ నగర్, బంజారా నగర్, కమ్యూనిటీ హాల్‌ల పునరుద్ధరణ కు శంకుస్థాపన పనులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మిర్జా రహమత్ బెగ్ ఖాద్రి ,మిర్జా రియాజ్ హాల్ హాసన్ ఎఫండీ, కౌసర్ మొహిను ద్దీన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, నవీన్ యాదవ్, అజారుద్దీన్,జోనల్ కమిషనర్ హేమంత్ ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## పదేళ్లు ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించారు

### హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ ఆది శ్రీనివాస్


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** పదేళ్ల పాటు ప్రభుత్వాస్పత్రు లను గాలికి వదిలేసి ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారని, ఎన్ని కుప్పిగంతులు వేసినా జూబ్లీహిల్స్ ప్రజలు హరీష్ రావు, కేటీఆర్‌లను పట్టించుకోరని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వాతావర ణం దగ్గరపడుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు చర్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీష్ రావు సమాధానం చెప్పాలని ఆదిశ్రీనివాస్ అన్నారు. అధికారం పోవడానికి ఏడాది ముందు టిమ్స్ హాస్పిటల్ కోసం టెండర్లు పిలిచారు. కానీ మా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వీటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో 90 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం విషయంలో హరీష్ రావు ఆరోపణలు నిజం కాదని ఆయన తేల్చారు. విదేశాల నుంచి ఆధునిక వైద్య పరిక రాలు రావాల్సి ఉండటంతో కొంత సమయం పడుతోంది. కానీ పేరు కోసం హడావుడిగా ప్రారంభం చేయాలని మాకు ఉద్దేశం లేదు.




## స్థానిక వ్యూహాల్లో కమలం నేతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుండి ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. స్థానిక ఎన్నికలంటే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందనే టాక్ ఉన్నప్పటికీ, మేమెక్కడా తగ్గేదే లేదంటున్నాయి బిజేపి ,బీఆర్ ఎస్ పార్టీలు. ముఖ్యంగా బిజేపి ఈసారి లోకల్ వార్ లో సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. అర్బన్ ప్రాంతాల్లోనే పట్టుందనేది కేవలం రూమర్లు మాత్రమే , బిజేపి బలం గ్రామీణ ఓటర్లేనని నిరూపించేందుకు ఇప్పటికే క్యాడర్ ను సన్నద్ధం చేస్తోంది.తెలంగాణ బిజేపికి 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్నారు.ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురు గ్రేటర్ బయట గెలిచినవారే. ఎనిమిది ఎంపీల విషయానికి వస్తే , వీరు గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గాలు ఎక్కువ గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాలే. ఇది చాలదా మా గెలుపు ఏ స్ధాయిలో ఉంటుందో చూపించడానికి అంటోంది కమలం పార్టీ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్ధానిక సంస్ధల ఎన్నికల్లో పోటీ చేస్తాం. గ్రామస్ధాయి సర్పంచ్ నుండి జిల్లా స్ధాయి జెడ్ పీటీసీ వరకూ బిజేపి అభ్యర్ధులను పోటీకి దించడంతోపాటు, కాంగ్రెస్ ,బిఆర్ ఎస్ ను అధిగమించి , నెంబర్ వన్ స్ధానాలు మేమే సాధిస్తామంటున్నారు ఆ పార్టీ కీలకనేతలు.బిజేపికి గ్రామీణ ప్రాంతాల్లో బలమైన క్యాడర్ ఇప్పటి వరకూ లేదు. క్షేత్రస్ధాయిలో బలమైన నాయకులు లేరు.

## గురుఅన్న పూర్ణ పురస్కారం అందుకున్న
# రుద్రగోని వెంకటేష్ గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 04,(తెలంగాణ దిశ) :** మహాశాస్త్రా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సూదగాని రాజు నిర్వహించిన 2025-అన్నపూర్ణ పురస్కారం-గురు పురస్కారాన్ని చర్లపల్లి అయ్యప్ప సేవా సమితి రామాలయం గురు స్వామి రుద్రగోని వెంకటేష్ గౌడ్ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ ఘన సభలో శనివారం అందుకున్నారు. గత 34 సంవత్సరాలుగా మాలధారణ చేస్తూ సామాజిక సేవా కార్యక్ర మాలకు గాను గురు స్వామి పురస్కారం, గత కొన్ని సంవత్సరాలుగా చర్లపల్లి రామాలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నందున గాను అన్నపూర్ణ పురస్కారంను శబరిమలై మాళికపురం మాజీ మేళ్ శాంతి గురు స్వాములు మురళీ నంభుద్రీ, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శివ నరసింహాన్ తంత్రి, బాల్ రాజ్, రుద్రగోని రాంచందర్ గౌడ్, నర్సింహ చారి, సుక్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరం ఉచిత వైద్య శిబిరం
## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**(కుత్బుల్లాపూర్, అక్టోబర్ 04, (తెలంగాణ దిశ) :**కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నందు "ఇస్మాయిలీ సివిక్" ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు వరం ఉచిత వైద్య శిబిరమని అన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఇస్మాయిల్ సివిక్ సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని శిబిరాలను "ఇస్మాయిలీ సివిక్" ఏర్పాటు చేయాలని, వారికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు పదికి పైగా ఆస్పత్రులు పాల్గొని చాలా మంది నిరుపేదలకు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంధా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షులు ఇక్బాల్ మందని తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ దుర్గామాత నిమజ్జన శోభయాత్ర







**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 04, (తెలంగాణ దిశ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీరామ్ నగర్ బి, చంద్రగిరి నగర్ లో శ్రీ శ్రీ దుర్గామాత నిమజ్జన శోభయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అమ్మవారి నిమజ్జన శోభాయాత్రల లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరామ్ నగర్ బి, చంద్రగిరి నగర్ లో వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమస్తా మధుసూదన్, రఘు రెడ్డి, దేవరాజ్, సురేందర్, జహంగీర్భాయ్, నరసింహ, మూతి శ్రీనివాస్ యాదవ్, కావలి శ్రీనివాస్, రమేష్ మంజూల్కర్, సంతోష్, సతీష్, నరేందర్ రెడ్డి, నిర్మల్ కుమార్, వినీత్ రెడ్డి, పంచ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# మచ్చ బొల్లారం స్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



అల్వాల్ మచ్చ బొల్లారంలోని స్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చింతల మాణిక్యం రెడ్డి శనివారం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు. స్మశాన వాటికలో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉదయ్ ప్రకాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- (అల్వాల్, తెలంగాణ దిశ)



విజయదశమి పర్వదినం సందర్భంగా ఐటీ శాఖ రాష్ట్ర మంత్రి జిల్లా ఇంచార్జీ దుద్దిళ్ల శ్రీధర్ బాబును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు వారితో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి, ఓబీసీ సెల్ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు కుమార్ యాదవ్, దూలపల్లి సహకార బ్యాంక్ డైరెక్టర్ రాజు, మహేందర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


- (కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

# ఎమ్మెల్యేలపై చర్యలు..!

**అమరావతి,తెలంగాణ దిశ :**అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీ 11మంది ఎమ్మెల్యేలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ పార్టీకి టెక్నికల్గా ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే? సభలో నాలుగు పార్టీలు ఉండగా మూడు కూటమి మిత్రపక్షాలే. ఇక మిగిలి ఉంది మేమే కాబట్టి మాకు ఆ హోదా కావాలన్నది వైసీపీ డిమాండ్. ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలాపడితే అలా ఇచ్చేసేదికాదని, సభా నియమాల ప్రకారం నడుచుకుంటూ అందుకు తగ్గట్టు జనం ఇచ్చిన తీర్పును బట్టే ఇచ్చేదన్నది ప్రభుత్వ వాదన. ఈ విషయంలో వైసీపీ కోర్ట్కు వె ళ్ళినా లక్ష్యం మాత్రం నేరవేరలేదు. తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉండదు కాబట్టి మేం అసెంబ్లీకి రాబోమంటూ పట్టుదలగా ఉన్నారు. మాజీ సీఎం జగన్. ఈపరిస్థితుల్లో? వైసీపీ ఎమ్మెల్యేలకు కొత్త భయం పెరుగు తున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే ప్రతీసారి వైసీపీ వాళ్లు సభకు రావాలి.. రాకుంటే చర్యలు తప్పవని అంటున్నారు స్పీకర్,డిప్యూటీ స్పీకర్. బడ్జెట్ సెషన్లో వైసీపీ సభ్యులు మమ అనిపి ంచినా? టెక్నికల్గా అవి కౌంట్లోకి రాలేదు. దీంతో వరుసగా 60 రోజులు సభకు హాజరుకాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవచ్చని తాజాగా హాట్ కామెంట్స్ చేశారు ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు.ప్రస్తుతం సెషన్ నడుస్తున్న క్రమంలో సభకు హాజరవకుంటే అనర్హత వేటు వేస్తామని, మీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు కూడా హెచ్చరించారు. ఇదే ఇప్పుడు పొలిటికల్ హాట్ అయ్యింది. తమ ఎమ్మెల్యేలపై చర్యల అంశంలో గతంలోనే స్పందించారు వైసీసీ అధ్యక్షుడు జగన్. వాళ్లకు బుద్ధి పుట్టినట్టు చర్యలు తీసుకోమనండి ఎవరు కాదన్నారంటూ రియాక్ట్ అయ్యారాయన. తాజాగా వైసీపీ ఎల్పీ సమావేశంలో కూడా ఇదే అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్ళు ఈ అంశాన్ని జగన్ ముందు ప్రస్తావించటంతో ఆయన కూడా గతంలో స్పందించిన తరహాలోనే చర్యలు తీసుకోనివ్వండి.. ఎ చర్చించటానికే కదా? మనం స మయం అడుగుతోంది. టెక్నికల్ రీజన్స్తో ప్రతిపక్ష హోదా ఇవ్వకపో యినా కనీసం నిర్దిష్ట సమయం ఇస్తామని కూడా క్లారిటీగా చెప్పడం లేదు? 40 శాతం ఓట్లు వచ్చిన మనల్ని సాధారణ సభ్యులుగా పరిగణి ంచి రెండు, మూడు నిమిషాల సమయం ఇస్తే సరిపోదు కదా.. అని జగన్ అన్నట్టు చెప్పుకుంటున్నారు.

# మనిషి ప్రమేయం లేకుండానే
# ఒక్క నిమిషంలో 200 కార్లు పార్కింగ్..

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్. పిపిపి విధానంలో ఇప్పటికే 10అంతస్తుల పార్కింగ్ భవనం నాంపల్లిలో సిద్ధం చేసింది. దేశంలో మరెక్కడాలేని సరికొత్త కార్ పార్కింగ్ అనుభూతుని అతి త్వరలో హైదరాబాద్ నగరవాసులకు అందించబోతోంది. హైదరాబాద్ నగరం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అంతేస్థాయి లో జనాభా పెరుగుదల, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. కారు పార్క్ చేయాలంటే నగరవాసులకు పట్టపగలు చుక్కలు కనిపిస్తు న్నాయి. రద్దీ మాల్స్ లో అయితే సెల్లార్ లో కార్ పార్క్ చేయడం,పార్కిం గ్ నుండి బయటకు తీయడం అంటే పద్మవ్యూహంలోకి వెళ్లి వచ్చామా అన్నంతలా నరకం చూస్తున్నారు. కారులో మనిషి లేకుండానే క్షణాల్లో కార్ పార్క్ చేయడం,పార్కింగ్ లొకేషన్ నుండి అంతే వేగంగా మనిషి లేకుండానే కారు ను పార్కింగ్ ఏరియా నుండి బయటకు తెచ్చేయడం ఈ మల్టీలెవిల్ ఆటోమేటెడ్ కార్పార్కింగ్ ప్రత్యేకత.



# రాజీనామాకు సిద్ధమౌతున్న
# మరో ఏడుగురు ఎమ్మెల్సీలు..?

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో విచిత్ర రాజకీయ పరిస్థితుల కొనసాగుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూటమి టార్గెట్ చేస్తోంది. కూటమిని తట్టుకొని నిలబడాలని చూస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే పోరాడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను వైసీపీ ఎమ్మెల్సీలు ఎండగడుతు న్నారు. మండలి చైర్మన్గా వైసీపీ నేత ఉండడంతో గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. మంత్రులు ధీటుగా బదిలిస్తున్నారు కానీ.. కూటమి ఎమ్మెల్సీ ల నుంచి ఆశించిన స్థాయిలో సహకారంఅందడం లేదు. అందుకే ఇప్పుడు టిడిపి కూటమి శాసనమండలిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున వైసీపీ ఎమ్మెల్సీలను తమ వైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ఏడాది కిందట వైసీపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు ఇప్పుడు కూటమి బాటపడుతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దాదాపు ఆరుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. వారి రాజీనామాకు చైర్మన్ తెలపకపోవడంతో పొలిటికల్ జంక్షన్ లో నిలబడి పోయారు. అయితే ఇప్పుడు ప్రత్యేక వ్యూహంతో కూటమి ఆహ్వానించడంతో ఆ పార్టీలో చేరిపోయారు. అయితే మండలి పై పూర్తి పట్టు సాధించేందుకు చంద్రబాబు గట్టి ప్లాన్ వేసినట్లు సమాచారం. శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత ఉంది. 2027 నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గి కూటమి బలం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మండలిలో 58 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం అధికారికంగా తెలుగుదేశం పార్టీకి 10, జనసేనకు ఒక ఎమ్మెల్సీ ఉ న్నారు. అయితే మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఐదుగురు ఎమ్మెల్సీలు కూటమికి సొంతమయ్యారు. ప్రస్తుతం శాసనమండలిలో టిడిపి కూటమి బలం 16 మంది ఎమ్మెల్సీలు. మరో ఏడుగురు ఎమ్మెల్సీ లు కూటమి పార్టీల్లో చేరారు. టిడిపి కూటమి టచ్ లోనే ఉన్నారు. ఈ లెక్కన మరో ఏడుగురు ఎమ్మెల్సీలను తమ వైపు తిప్పుకుంటే.. మండలిలో కూటమికి చేజిక్కినట్టే.

# పురుషుల కంటే ఉద్యోగ అవకాశాలు
# భారీగా కోల్పోనున్న భారత మహిళలు

హెచ్ -1 బివీసా లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడనుంది. మిగతా దేశాల మాట అటుంచితే.. ముఖ్యంగా భారత్ యువత ఉపాధిపై కోలుకోలేని దెబ్బ పడింది. మరీ ముఖ్యంగా మహిళల పరిస్థితి అగమ్యగోచరమైంది. మగవారికంటే ఎక్కువ చదువు కున్నా.. ఉద్యోగాల విషయంలో కంపెనీలు మగవారికే మొగ్గు చూపుతు న్నాయి. దీంతో అమెరికాలో మహిళల ఉపాధి అవకాశాలు బాగా తగ్గే అవకాశం ఉందని పలు సర్వేలు వెల్లడించాయి.

ఉదాహరణకు హెచ్-1బి వీసా ద్వారా గతేడాది అమెరికు వెళ్లిన కార్మికుల్లో ఉద్యోగాలు కొనసాగించడానికి అవకాశం ఉన్న కార్మికుల్లో 74శాతం మంది పురుషులు ఉంటే.. 26 శాతం మంది మాత్రమే మ హిళలున్నారు. ఇక జీతాల విషయానికొస్తే.. స్త్రీ-పురుష జీతాల్లో చాలా వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు 2024 సంవత్సరం ప్రకారం చూస్తే.. ప్రారంభంలో కొద్దినెలల ఉద్యోగానికి (బోటమ్ క్వార్టర్ 25 శాతం)) మహిళల జీతం 77వేల డాలర్లు. అదే పురుషులకైతే 1,02,000 డాలర్లు. ఇక మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలకు 97వేల డాలర్లు, పురుషులకు 1,32,000 డాలర్లు. టాప్ క్వార్టర్ (75 శాతం) మహిళలకు 1,30,000 డాలర్లు, పురుషులకు 1,69,000 డాలర్లు సంపాదిస్తున్నారు. చదువు అయిపోగానే ఉద్యోగం చేసే మహిళలు, పురుషుల జీతాల్లో కూడాజీతాల వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది.

బోటమ్ క్వార్టర్ (25 శాతం) 71,000, పురుషులకు 80,000 డాలర్లు. మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలు 91,000 డాలర్లు, పురుషులు 99,000 డాలర్లు. ఇక టాప్ క్వార్టర్ అయితే మహిళలకు 1,25,000 డాలర్లు. పురుషులకు 1,31,000 డాలర్లు సంపాదిస్తున్నారు. పురుషుల కంటే.. మహిళలు చాలా తక్కువ జీతంతోనే పనిచేస్తున్నారు.

## సంపాదకీయం

# అమెరికాకు చెక్..

జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో కోట్ల మంది భారతీయుల రోజువారీ ఆర్థిక భారం కొంత తగ్గనుంది.నిత్యావసరాలైన పాలు, బ్రెడ్ వంటి వాటితోపాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రాణాధార ఔషధాలు లాంటి వాటిపై పన్నును పూర్తిగా తొలగించారు.చిన్న కార్లు, టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్ల మీద పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. ఇతర సాధారణ వస్తువులైన హెయిర్ ఆయిల్, సబ్బు, షాంపూ వంటి వాటిపై 12 లేదా 18 శాతానికి బదులుగా 5 శాతం పన్ను మాత్రమే ఉంటుంది.వస్తు సేవల పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ప్రారంభంలో ప్రకటించారు.దీని వల్ల పన్నుల విధానం సరళీకృతంగా మారుతుందని.. .ఇంటి ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు.విజయ దశమి పండుగ సందర్భంగా ప్రజలు కొత్త కార్లు, దుస్తులు కొనుగోలు చేస్తారు. ఇలాంటి సమయంలో జీఎస్టీ రేట్లు తగ్గించడం పండగ సీజన్‌లో కొత్త వస్తువుల కొనుగోలుకు ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.పన్ను తగ్గింపు వల్ల వినియోగ వస్తువులైన ప్యాకేజ్డ్ ఫుడ్, దుస్తుల అమ్మకాలు ఈ నాలుగు నెలల్లో పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.అమెరికా విధించిన 50శాతం సుంకాల ప్రభావాన్ని జీఎస్టీ సవరణ తగ్గించవచ్చు.ప్రజలకు డబ్బు మిగలడం వల్ల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబులను మార్చడం ద్వారా రాయితీలు, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించడం, తాజాగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ కోతలు కొనుగోళ్లు పెరగడానికి సానుకూలంగా ఉన్నాయి.రిలయన్స్, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి సంస్థలు పన్నుల తగ్గింపు లాభాన్ని వినియోగదారులకు అందించడం ద్వారా అమ్మకాల్ని పెంచుకుంటున్నాయి.ఆగస్టులో ప్రధాని మోదీ ప్రకటన తర్వాత కార్ల తయారీ సంస్థలు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో కార్ల కంపెనీల షేర్లు 6-17 శాతం పెరిగాయి.జీఎస్టీ సవరణల తర్వాత కార్ల గురించి అడిగే వారి సంఖ్య పెరిగిందని డీలర్లు చెబుతున్నారు.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు 30 నుంచి 40శాతం పెరుగుతాయని భావిస్తున్నట్లు ముంబయిలోని హీరో మోటోకార్ప్ షోరూమ్ డీలర్ ఒకరు చెప్పారు.”ధరలు తగ్గడంతో తొలిసారి బైక్ కొంటున్న వారి నుంచి ఎంక్వైరీలు ఎక్కువగా వస్తున్నాయి” అని హీరో మోటోకార్ప్ సంస్థ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అశుతోష్ వర్మ వివరించారు.ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి “తక్కువ ధర మోడళ్ల” విషయంలోనే ఉండేదని ఆయన అన్నారు.తాను ఈ ఏడాది 200సీసీ బైక్ కొనాలని భావిస్తున్నట్లు విశాల్ పవార్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెప్పారు.”పండుగ డిస్కౌంట్లు, పన్నుల కోత వల్ల ఏదైనా కొనడానికి ఇదే మంచి సమయం. ఈ దసరా పండగ సందర్భంగా నేను బైక్ కొంటున్నాను” అని ఆయన అన్నారు.ఇకపై తమ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరుగుతాయని వినియోగ వస్తువుల తయారీ సంస్థలు కూడా ఆశాభావంతో ఉన్నాయి.పన్ను తగ్గింపుతో పాటు దేశావ్యాప్తంగా ఈ ఏడాది పంటలు బాగా పండటంతో ఎయిర్ కండీషనర్ల వంటి వస్తువుల మార్కెట్ మెట్రో నగరాలను దాటి విస్తరిస్తుందని భావిస్తున్నట్లు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సవ్యసాచి గుప్తా చెప్పారు.అయితే జీఎస్టీ తగ్గించడం వల్ల గోద్రెజ్ లాంటి కంపెనీలు డిమాండ్ ఏ మేరకు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ధరల తగ్గింపుకు సంబంధించిన లేబుల్స్ ముద్రించడంలో బిజీగా మారాయి.మేం పాత, కొత్త ధరలను పక్క పక్కనే ముద్రిస్తున్నాం. దాని వల్ల వినియోగదారుడికి ధర ఎంత తగ్గిందో తెలుస్తుంది” అని సవ్యసాచి గుప్తా బీబీసీకి చెప్పారు.చిన్న బ్రాండ్లు, దుకాణదారులు తగ్గిన పన్నులకు అనుగుణంగా ధరల్ని సవరించే పని పూర్తి స్థాయిలో చేపట్టలేదు.వారి వద్ద తగినంత సమయం, వర్కర్లు లేకపోవడంతో తగ్గిన ధరలతో ప్యాకింగ్ చేయడం కష్టంగా మారింది.ముంబయిలోని ప్రఖ్యాత క్రాఫోర్డ్ మార్కెట్ నగరంలో అతి పెద్ద హోల్‌సేల్ రిటైల్ మార్కెట్.ఇక్కడ సుగంధ ద్రవ్యాల నుంచి గుండీల వరకు అన్నీ అమ్ముతారు.జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల గురించి ఈ మార్కెట్‌లో కొద్ది మంది దుకాణదారులకు మాత్రమే అవగాహన ఉంది.అవగాహన ఉన్న వారిలోనూ అయోమయం కనిపిస్తోంది.తాను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన వస్తువుల ధరల్ని సవరించిన శ్లాబులకు అనుకుణంగా ఎలా మార్చాలనే దాని గురించి సరఫరాదారులతో చర్చిస్తున్నట్లు టపాసుల దుకాణం నిర్వహిస్తున్న షేక్ రెహమాన్ చెప్పారు.ఆయన దుకాణానికి పక్కనే ఉన్న బ్రైడల్ షోరూమ్‌లో నిరాశ కనిపిస్తోంది.ప్రభుత్వం రెండున్నర వేల రూపాయల కంటే తక్కువ ఉన్న దుస్తులపై జీఎస్టీ తగ్గించింది. అంత కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై జీఎస్టీ 18శాతంగా ఉంది.పెళ్లికి ధరించే దుస్తుల ధరలు రెండున్నర వేల రూపాయల కంటే ఎక్కువే ఉంటాయి. దీంతో నరేష్‌కు చెందిన బ్రైడల్ షోరూమ్‌లో దుస్తులు కొంటే 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.దీని ప్రభావం సరఫరా వ్యవస్థలతో పాటు డిజైనర్లు, చేనేత కళాకారులు, రిటైలర్లు, కస్టమర్లపై పడుతుంది.”భారతీయులు పెళ్లికి ధరించే దుస్తుల మీద భారీగా ఖర్చు పెడతారు. పెళ్లిళ్ల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. అయితే పన్నుల పెరుగుదల వల్ల ఈ ఏడాది కొనుగోళ్లు కాస్త మందగించవచ్చు” అని నరేష్ చెప్పారు అయితే జీఎస్టీ తగ్గింపు ప్రభావం విస్తృత స్థాయిలో సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.”జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజల నెలవారీ ఖర్చులో మూడోవంతు ప్రయోజనం కలుగుతుంది. దీని వల్ల వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది” అని క్రిసిల్ రేటింగ్ ఏజెన్సీ చెబుతోంది.జీఎస్టీ సవరణ ప్రభావం “తయారీ సంస్థలు ధరల తగ్గింపును ఏ మేరకు వినియోగదారులకు అందిస్తాయి” అనే దానిపై ఉంటుందని రేటింగ్ ఏజన్సీ క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంపైనా ఉంటుందని అంచనా వేసింది.వస్తు సేవల పన్ను శ్లాబుల్లో మార్పుల వల్ల ఏడాదికి వేల కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతామని ప్రభుత్వం అంచనా వేసింది.అయితే మూడీస్ లాంటి రేటింగ్ ఏజన్సీస్ మాత్రం ప్రభుత్వ అంచనాల కంటే ఎక్కువే ఉండవచ్చని భావిస్తున్నాయి. రానున్న సంవత్స రాల్లో ఖజానాపై భారం ఇంకా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నాయి. గతేడాది 20శాతం పెరుగుదలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ పన్ను వసూళ్లు స్వల్పంగా పెరిగాయి. అయితే ఖర్చుల పెరుగుదల 20 శాతం కంటే ఎక్కువగా ఉందిఆర్థిక లోటు నియంత్రణ, ఆదాయ వ్యయాల మధ్య అంతరం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల నిర్మాణంలో వేగానికి రానున్న రోజుల్లో బ్రేకులు వేయాల్సి రావచ్చు.

# రైతుల్ని ఆదుకునే విధానం ఇదేనా..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తమది రైతు ప్రభుత్వమని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ల క్ష్యమని పదే పదే ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వారి కూటమి ప్రభుత్వం ఆచరణలో వీసమెత్తు మేలు చేయకపోగా సిండికేట్‌గా మారి, రైతుల మూలుగలను పీలుస్తూ బడా వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్నది. రైతుల అకౌంట్‌లో నేరుగా డబ్బులు వేస్తున్నామంటూ ఊరూరా మైకులు పెట్టి డప్పు వాయిస్తున్న కూటమి చర్యలు పరోక్షంగా వ్యాపారులకే ఉపయోగపడుతున్నాయి. ఈ సంవత్సరం ప్రారంభం నుండి రాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఈవిషయం స్పష్టం గా అర్థమవుతుంది. 2024 నవంబర్ నుండి గుంటూరు మిర్చి మార్కెట్ యార్డులో ధరల పతనం ప్రారంభమైంది. అంతకు ముందు సంవత్సరం క్వింటాలు రూ.26 వేలకు అమ్ముకున్న రైతులు ఆ తరువాత అప్పుల బారి నుండి బయటపడవచ్చన్న విశ్వాసంతో మిర్చి విస్తీర్ణాన్ని పెంచారు. దీన్నే అదునుగా తీసుకున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి సీజన్ ప్రారంభం నుండే క్వింటా రూ.13 వేలకు తగ్గించేశారు. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోలేదు. చివరకు అది రూ.9 వేలకు పడిపోయింది. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు ప్రారంభించాకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగమేఘాలమీద ఆదుకుంటున్నట్లు ప్రకటనల మీద ప్రకటనలు గుమ్మరించారు. రూ.11,781కు తక్కువగా అమ్ముకుంటే ఆ పైమొత్తాన్ని రొక్కంగా ఇస్తామని ఊరించారు. ఉత్సవాలు కూడా జరిపారు. వారి పార్టీ అనుయాయుల చేత పాలాభిషేకాలు చేయించారు. కానీ రైతుల మొఖాల్లో ఆనందం లేదు. ఆ తేడా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేస్తామన్న ప్రభుత్వ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఒక్క రైతు ఖాతాలో ఒక్క పైసా కూడా వేయలేదు. పడిపోయిన ధరతో మిర్చి రైతులు దివాళా ఎత్తారు. ఒక సంవత్సరం లాభం వస్తే ఆ ఆశ చూపి మూడేళ్ళు ధరలు కోసి పిండుకోవడం మార్కెట్‌లో ఒక వ్యూహంగా మారింది.

ఈ సంవత్సరం మార్చి నుండి నల్ల బర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు సంక్షోభంలో పడ్డారు. ముందు నుండి ప్రోత్సహించి నల్ల బర్లీ పొగాకు వేయించిన ఐటిసి, అలయన్, డెక్కన్ జిపిఐ వంటి కంపెనీలు మొఖం చాటేశాయి. మీరు మాకు చెప్పి వేశారా? అంటూ మంత్రులు రైతులపై ఆగ్రహించారు. నల్ల బర్లీకి డిమాండ్ లేదన్న కంపెనీలు తెల్ల బర్లీకి సైతం ధర ఇవ్వలేదు. సగానికి మించి కొనలేదు. వర్జీనియా పొగాకు రైతులకు అంతకు ముందు సంవత్సరం మీద సగం ధరే గిట్టుబాటయ్యింది. ఏప్రిల్, మే మాసాల్లో రైతులు వివిధ రూపాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశాకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి కొంత వరకు కొనడం వల్ల ఆ మేరకైనా తెల్ల బర్లీ రైతులకు ఊరట లభించింది. ఇప్పటికీ 30 శాతం పొగాకు రైతుల వద్దే ఉండిపోయింది. వర్జీనియా మాడు (తక్కువ నాణ్యత) అమ్ముడు పోలేదు.

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలే పనిచేయలేదు. పేరుకు కేంద్రాలు పెట్టి, బ్యానర్లు తగిలించారు తప్ప మిల్లర్ల దయాదాక్షిణ్యానికి ధాన్యం రైతులను బలిచేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, మిల్లర్లు రూ.2 వేలకు మించి ఎక్కడా కొనలేదు. తడిచిందని, తేమ ఎక్కువ ఉందని, ముక్క విరిగిపోతుందని రకరకాల సాకులు పెట్టి మిల్లర్లు రేట్లు దిగ్గోసేశారు. పేరుకు రైతు సేవా కేంద్రాలున్నా అవి మార్కెట్‌లోకి దిగలేదు. రేషన్ బియ్యం దారి తప్పి విదేశాలకు స్మగుల్ అవుతుందని హడావుడి చేసిన పౌర సరఫరాల శాఖా మాత్యులు అక్రమాలకు పాల్పడ్డ మిల్లర్లపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. ‘సీజ్ ద షిప్’ అంటూ రంకెలు వేసిన పవన్ కల్యాణ్ ఆ తరువాత పత్తా లేరు. షిప్పుల దారిన షిప్పులు దొంగ సరుకు తీసుకొని వెళ్ళిపోయాయి. పైగా బియ్యం బదులు డబ్బు ఇస్తామంటూ రేషన్ కార్డు హోల్డర్లకు ఆశ చూపుతున్నారు. రైతులనుండి సేకరించిన సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు ఇవ్వకుండా మిల్లర్లకు అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వం. అదే మిల్లర్లు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే మిన్నకుండి పోయింది. తాజాగా కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులు రోడ్డెక్కారు. కర్నూలు ఉల్లి మార్కెట్ అతి పెద్దది. ఈ జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతున్నది. ఉత్పత్తి ఖర్చు లక్ష నుండి లక్ష 20వేల వరకు అవుతుంది. కౌలుకు తీసుకుంటే మరో పాతిక వేలు డబ్బు ముందుగానే చెల్లించాలి. గత సంవత్సరం క్వింటాలుకు రూ.6 వేల వరకు అమ్ముడైన ఉల్లి ఈ సంవత్సరం రూ.300 నుండి500లకే అమ్ముకోవాల్సిన దుర్గతి పట్టింది. ఉల్లిని రోడ్డుపై పోసి రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడంతో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకొని రూ.1200కు కొంటామని వాగ్దానం చేసింది. నాలుగు రోజులు కొని చేతులెత్తేసింది. కొన్న సరుకును సైతం మార్కెట్ యార్డుల్లో బహిరంగంగా కుళ్ళబెడుతున్నది. 100 రూపాయలకు 45 కేజీల బస్తాను కర్నూలు మార్కెట్‌లో ఒక్కరోజు కలెక్టరే ప్రత్యక్షంగా అమ్మకాలు సాగించారు. ఇప్పుడు హెక్టారుకు రూ.50 వేలు (ఎకరాకు రూ.20 వేలు) ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటన చేశారు. ఇదే విషయాన్ని రైతులకు చెప్పగా 2017లో ఇదే ప్రభుత్వం ఉల్లి రైతులకు రూ.300 అదనంగా ఖాతాల్లో వేస్తామని చెప్పి ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. రైతులకు రూ.5 కోట్లు బకాయి పడింది.

ఈ విధానంలో పూర్తిగా నష్టపోయేది కౌలురైతులు. ఇప్పుడు ఈ వాగ్దానం కూడా మిర్చి రైతులకు ఇచ్చిన వాగ్దానం లాంటిదే అవుతుందని రైతులు సహేతుకంగానే సందేహిస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి కొనుగోలు చేయకుండా మార్కెట్ నుండే ఉపసంహరించుకొని రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పడం ద్వారా ఎవరికి మేలు జరిగింది? మార్కెట్‌లో ప్రభుత్వం రూ.1200 చొప్పున కొనుగోలు చేస్తే ఒక ఎకరాకు సగటున 70 క్వింటాళ్ళు అయితే 70శ1200 చొప్పున రూ.84 వేలు రైతుకు వస్తుంది. ఇప్పుడు ఎకరాకి రూ.20 వేలు అంటే క్వింటాలుకు రూ.285 మాత్రమే వస్తుంది. ఇది వ్యాపారుస్తులు కొనే రేటుకన్నా తక్కువ. ప్రభుత్వం డబ్బులు ఇస్తానంటున్నది కాబట్టి ఆ మేరకు ధరలు కోత పెట్టి వ్యాపారులు ముంచేస్తున్నారు.

పత్తికొండ, ఆదోని, మదనపల్లి తదితర ప్రాంతాల్లో టమాటా ఆరు వేల ఎకరాల్లో పండిస్తున్నారు. రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. నేను (రచయిత) 22వ తేదీన పత్తికొండ మార్కెట్‌లో కార్యదర్శిని విచారించినప్పుడు కిలో రూ.11 నుండి 13 రూపాయలకు అమ్ముడు పోతున్నట్లు చెప్పారు. కానీ వాస్తవంలో రైతులు 5 రూపాయలు లోపే అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం గరిష్ట ధర చెప్పి ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నది. ఈమార్కెట్ నుండే హైదరాబాద్ లాంటి నగరాలకు టమాటా ఎగుమతి అవుతున్నది. అదే రోజు హైదరాబాద్‌లో రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.50కు వినియోగదారులు కొన్నారు.

ఈ తేడాను గమనిస్తే రైతులు ఎంత దారుణంగా దోపిడీకి గురవుతున్నారో అర్థమవుతున్నది. ఈప్రాంతంలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ పెడతామంటూ గత రెండు దశాబ్దాలుగా పాలకులు ఊరిస్తున్నారు. తాజాగా కూటమి మంత్రి భూమి పూజ చేశారు.

ఇదే విషయం ఒక మహిళా రైతు దగ్గర నేను ప్రస్తావించగా ఈమాట నా చిన్నప్పటి నుండి వింటూనే ఉన్నానంటూ చప్పరించేసింది. ఆమె గత ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికే ఓటేసినట్లు చెప్పింది. పార్టీలతో నిమిత్తం లేకుండా టమాటా రైతులు నష్టపోతున్నారు. కానీ ఇక్కడ 7,8 మంది వ్యాపారస్తులు రిజిస్టర్ చేసుకుంటే వాస్తవంలో మూడు, నాలుగు కంపెనీలు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుండి వ్యాపారస్తులను అనుమతించడం లేదు. మార్కెట్ యార్డు కార్యదర్శి కారణాలు చెప్పడానికి కూడా సందేహించారు. వ్యాపారుస్తుల సిం డికేట్‌కు ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తున్నది.

# ఆ యాప్‌తో ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట






స్మార్ట్ ఫోన్ వాడటం అంత ఈజీ కాదని అమ్మమ్మ తాతయ్యలు ఎప్పుడూ అంటారు. పిల్లలకి దూరంగా ఉన్న చాలామంది పెద్దలు ఈ టెక్నాలజీని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లు ఆన్‌లైన్ మోసాలకు గురవుతుంటారు. ఈ పరిస్థితి ఇక నుండి వాళ్లకి రాకూడదని భావించింది టెక్సాస్‌కి చెందిన 17 ఏళ్ల తేజస్వి మనోజ్. భారతీయ సంతతికి చెందిన తేజస్వి, అమ్మమ్మ, తాతయ్య ఇక నుండి ఆన్‌లైన్‌మోసాలకు గురవ్వకుండా వాళ్ల నిఎడ్యుకేట్ చేసేలా ‘షీల్డ్ సీనియర్స్’ పేరుతో సురక్షితమైన ఓ యాప్‌ని కోడింగ్ చేసింది. ఈ కృషికి గాను ‘టైమ్స్ కిడ్ ఆఫ్ దఇయర్ 2025’ అవార్డు ఆమెకి దక్కింది. డల్లాస్‌లో పుట్టి పెరిగిన తేజస్వి, ఎనిమిదేళ్లప్పుడు అమెరికాకి వెళ్లింది. అక్కడే తన విద్యాభ్యాసం కొనసాగించింది. అప్పుడే కోడింగ్‌పై మక్కువ పెంచుకుంది. ‘కోడింగ్‌నాకు ఓ అద్భుతంలా అనిపించింది. భవిష్యత్తులో దాన్ని మరింతగా అధ్యయనం చేయాలని బా ల్యంలోనే బలంగా అనుకున్నాను’ అని తేజస్వి చెబుతోంది.

2024లో తేజస్వి తాతయ్య ఓఆన్‌లైన్ మోసానికి గురయ్యారు. మోసగాళ్లు బంధువుల్లా నటించి డబ్బులుఅడిగారు. దీనిపై అంతగా అవగాహన లేని తేజస్వి తాతయ్య చాలా డబ్బులు పోగొట్టుకున్నారు. అప్పుడే ‘షీల్డ్ సీనియర్స్’ ఆలోచన తనకి వచ్చినట్లు ఈ సందర్భంగా తేజస్వి గుర్తుచేసుకున్నారు. ఇంకా ఆమె ఏం అన్నారంటే..

‘షీల్డ్ సీనియర్స్ లక్ష్యం వృద్ధులు ఆన్‌లైన్లో స్వతంత్రంగా, నమ్మకంగా, గౌరవంగా ఉండేలా చూడడం.

మోసాలను గుర్తించి, తప్పించుకునేలా సహాయం చేయడం’ అని వివరించారు. టైమ్ కథనం ప్రకారం 2024లో ఆన్‌లైన్ మోసాల వల్ల దాదాపు రూ.500 కోట్ల నష్టం వాటిల్లింది. దీన్నిబట్టే తేజస్వి చేసిన ఈ ప్రయత్నం ఎంత అవసరమో అర్థమవుతుంది.

తేజస్వి చేసిన ఈ కృషి పలు అంతర్జాతీయ వేదికల్లో గుర్తింపు కూడా పొందింది. వృద్ధులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సెమినార్లలో ఆమె ప్రయత్నానికి ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఆ అనుభవాన్ని తేజస్వి ఇలాచెబుతోంది. ‘మొదటిసారి సెమినార్ నిర్వహిం చినప్పుడు చాలా టెన్షన్‌గా అనిపించింది. కానీ అక్కడికి వచ్చిన పెద్దవారు ఎంతో ఆసక్తిగా వింటూ, నోట్సు రాసుకుంటున్నారు. అప్పుడు చాలా ఆనందమేసింది. కొంతమందైతే నన్ను ప్రశ్నలు అడిగి మరీ సమాధానాలు రాసుకున్నారు’ అనిచెప్పింది. సాంకేతికతని అర్థంచేసుకోలేక ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్న ఎందరో పెద్దవారికి తేజస్వి చేసిన ప్రయత్నం గొప్ప ఊతంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# వానలు, వరదలతో అన్నదాత ఘోష!

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** నిర్మల్ జిల్లాలో గత నెల నుంచి కురిసిన వర్షాలు అన్నదాత లకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాన కాలంలో సాగుచేసిన పంటలకు భారీ వర్షాల వల్ల వాగులు గొర్రెలు చెరువు లు నదులు ఉప్పొంగి ప్రవహి ంచడంతో వరదదాటికి పంటలు నీట మునగడమే కాకుండా కొట్టుకపో యాయి. నిర్మల్ జిల్లాలో 79వ్యవసాయ కష్టాల పరిధిలో వర్షాలు వరదల వల్ల20, 000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు వంచన వేస్తున్నారు.జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు స్వర్ణ వాగు ప్రాజెక్ట్ గడ్డన్న శుద్ధ వాగు తో పాటు గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర లోకేశ్వరం దిల్వార్పూర్ సొన్ లక్ష్మణ చందా ఖానాపూర్ కడెం దస్తురాబాద్ మండలాల్లో పత్తి సోయా మొక్కజొన్న వరి పసుపు తదితర పంటలు మూడు రోజులపాటు నీటిలోనే ఉండడంవల్ల అధిక నీటితో కూలిపోయినట్టు రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు సారంగాపూర్ నర్సాపూర్ కుబీర్ కుంటాల తదితర మండలాలు చెరువు అలుగులు వాగుల వల్ల వరదల్లో తీవ్ర నష్టం జరిగినట్టు రైతులు పేర్కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసుకున్నాం పంటలు నష్టపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించినట్టు తెలిపారు. జిల్లాలోని 79 వ్యవసాయ క్లస్టర్లలో ఏఈవోలు ఆయా కష్టాల పరిధిలో భారీ వర్షాలు వరదల వల్ల దెబ్బతిన్న వివిధ పంటలను సర్వే నెంబరు ఫోటో రైతు పేరు పంట నష్టం ఎకరాలు తదిత వివరాలను నమోదు చేసుకొని ఆన్లున్ చేశారు. జిల్లాలో మొత్తం 12,804 రైతులు 19530 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్టు తెలిపారు. ఇందులో వరి పంట 59 82 ఎకరాలు పత్తి 38:40 సోయా 62 86 మొక్కజొన్న 18 85 పసుపు 10 62 ఆయిల్ సీడ్ పంట 326 ఎకరాలు నష్టపోగా మిగతాది పప్పు దినుసులు పంటలు కూరగాయ పంటలు నష్టపోయినట్లు అధికారులు సర్వే నిర్వహించారు.వాన కాలంలో పంటలు సాగు చేసుకునేందుకు దుక్కులు దునడాన్ని మొదలుకొని విత్తనాలు వేయడం కలుపు తీయడం ఎరువులు వేయడం కూలీల ఖర్చులు పిచికారి మందులతో ఎకరానికి 10,000 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అధిక వర్షాలు ఆపై వరదలు పంటలను నీటిలో ముంచడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల కూలిపోయి



పంట చేతికి వచ్చే అవకాశాలు లేదని ఆయా గ్రామాల రైతులు కన్నీటి పర్యవంతమవుతున్నారు.మరో నెలరోజులు కడితే పంటలు చేతికొచ్చి దశలో తాము పంట కోల్పోలువలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యవసాయ పంట భూములు కోతలు ఏర్పడి ఇసుక మేటలు కూడా వేయడంతో వాటిని తొలగించాలంటే వేలాది రూపాయల ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పరిహారంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారుఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటేనే మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో భారీ వర్షాలు వరదల వల్ల నష్టపోయిన పంటలను జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి వేడుమ బుజ్జి పటేల్ రామారావు పటేల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టంపై విచారంవ్యక్తం చేశారు. ఎకరానికి 25 వేలు చెల్లించాలని బిజెపి ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుండగా అధికార పార్టీ మంత్రి మాత్రం ప్రభుత్వం ఆదుకుంటుంది అని చెప్పారు తప్ప ఎకరానికి ఇంత డబ్బులు ఇస్తామని ఎక్కడ స్పష్టం చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకునేలా నష్టపరిహారాన్ని ప్రకటించి రెండు పంట పెట్టుబడికి బ్యాంకు రుణాలు అందించాలని జిల్లా రైతులు కోరుతున్నారు

# జగన్‌తో విభేదిస్తున్న ఆ ఆరుగురు!



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్ బై చెబుతారా?తమంతట తాము బయటకు వెళ్లేందుకు సిద్ధంగాఉన్నారా? లేకుంటే అధికార పార్టీ ప్రలోభ పెడుతోందా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం తాజాగా ఒక ప్రకటన చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్ళిపోయే అవకాశం లేదని తేల్చి చెప్పారు. చివరి వరకు తమ కుటుంబం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగుతుందని.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులమని చెప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే ఉన్నపలంగా వైసీపీ ఎమ్మెల్యే ఇప్పుడు పార్టీ మారడం లేదని చెప్పడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది. అదే సమయం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు టిడిపిలో చేరడం కూ డా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏడాది పాటు ఎదురుచూసిన వారు ఇప్పుడు చేరుతుండడం ఆసక్తికర ంగా మారింది. అదే సమయం లో బిజెపిలోకి ఒక ఎమ్మెల్సీ వెళ్లడం కూడా చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చుట్టూ ఏదో జరుగుతోందన్న అనుమానం బలపడుతోంది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో ఐదుగురు పార్టీలో సీనియర్లు. ఆపై జగన్మోహన్ రెడ్డి సొంత సామాజిక వర్గానికి చెందినవారు. మిగతా వారు మాత్రం కొత్తవారే. కూటమి ప్రభంజనాన్ని సైతం తట్టుకొని ని లబడ్డారు. అయితే వారు అసెంబ్లీకి వెళ్లి అధ్యక్షా అనాలని ఎక్కువ మందికి ఆలోచన ఉంటుంది. ఎందుకంటే ఎమ్మెల్యేగా గెలిచి సభలో అడుగు పెట్టడం అనేది ప్రతి ఒక్కరి కల. కానీ జగన్మోహన్ రెడ్డి రాజ కీయ కోణంలో ఆలోచించి సభకు గైర్హాజరవుతున్నారు. అయితే వైసీపీకి తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉ న్నా.. అందులో ఎక్కువ మంది జగన్ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. దీంతో వారంతా అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.ఏపీలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 18న ప్రారంభం అయ్యాయి. అదే రోజు జగన్ పార్టీ ఎమ్మెల్యేలు తో సమావేశం అయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని తేల్చి చెప్పారు. సభకు హాజరైన మాట్లాడే అవకాశం ఇవ్వనందున.. మనం సభకు వెళ్లడం వృధా ప్రయాస అని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు బాహటంగానే వ్యాఖ్యా నాలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. సభకు వెళితే బాగుంటుందన్న అభిప్రాయం వినిపించింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి సారధ్యంలో మీరు సభకు వెళ్ళొచ్చని జగన్ ఎమ్మెల్యేలతో అన్నట్లు కూడా టాక్ నడిచింది. కానీ అందుకు పెద్దిరెడ్డి విముఖత చూపడంతో అక్కడితో ఆ చర్చ ఆగిపో యింది. జగన్ తిరిగి బెంగళూరు వెళ్ళిపోయారు.ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పాడేరు వైద్య కళాశాల విషయంలో కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు ఆందోళన చేపట్టారు. అయితే పక్కనే ఉన్న అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం మాత్రం హాజరు కాలేదు. ఆపై సీఎం చంద్రబాబు సమక్షంలో వైసీపీ ఎమ్మెల్సీలు టిడిపిలో చేరారు. దీంతో రాజకీయంగా కూటమి సరికొత్త ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డిని విభేదించి ఓ ఐదు, ఆరుగురు ఎమ్మెల్యేలు సభకు హాజరైతే ఇబ్బందుల్లో పెట్టవచ్చున్న ఆలోచనలో కూటమి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖంగా అరకుఎమ్మెల్యే మత్స్య లింగం పేరువినిపిస్తోంది. ఆయనతో పాటు ఓ ఐదుగురిని సభకు రప్పించి.. ప్రజాక్షేత్రంలో జగన్మోహన్ రెడ్డిని పలుచన చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

## 'బాడీగార్డ్' ఉపగ్రహాలకు

# భారత్ సన్నాహాలు..!

ప్రస్తుతం శాటిలైట్ కమ్యూనికేషన్లు ప్రజల రోజువారీ కార్యకలాపాలకు అత్యంత ముఖ్యమైనవి. ఒక్కరోజు ఇవి ఆగిపోయినా.. జనజీవనం స్తంభించిపోతుంది. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో వీటిని కాపాడుకోవడం చాలా ముఖ్యం. గతంలో అంతరిక్షంలో మన ఉపగ్రహాలు పలుమార్లు ప్రమాదాలను తృటిలో తప్పించుకొన్నాయి. అందుకే వాటికి రక్షణగా బాడీగార్డ్ శాటిలైట్స్‌ను తయారుచేయాలని కేంద్రం భావిస్తోంది. ఇవి మన ఉపగ్రహాలకు వస్తున్న ముప్పును ముందే గుర్తించి వాటిని అడ్డుకొంటాయి. 2024 సంవత్సరం మధ్యలో భూమికి 500-600 కిలోమీటర్ల ఎత్తులో మన ఉపగ్రహం పరిభ్రమిస్తోంది. దాదాపు అదే ఎత్తులో ఎలాన్‌మస్క్‌కు చెందిన స్టార్ లింక్ శాటిలైట్లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. మన పొరుగుదేశానికి చెందిన ఓ స్పేస్ క్రాఫ్ట్ కూడా గతంలో మన మిలిటరీ ఉపగ్రహానికి అత్యంత సమీపంలోకి వచ్చింది. రెండింటి మధ్య దూరం కిలోమీటర్ కంటే తక్కువ ఉంది. కొన్ని సందర్భాల్లో తమ శక్తి ప్రదర్శన కోసం ఆయా దేశాలు కావాలనే ఇటువంటి పనులు చేస్తాయి.

**ఏమిటీ ప్రాజెక్టు..?**

ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.270 కోట్లతో 50 నిఘా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలని భావిస్తోంది. వీటిని వచ్చే సంవత్సరం ప్రయోగించవచ్చని భావిస్తున్నారు. గత 70 ఏళ్లలో పాక్, చైనాతో మన దేశం పలు యుద్ధాలు చేయాల్సివచ్చింది. వీటిల్లో చైనా అంతరిక్ష రంగంలో బాగా ముందడుగు వేసింది. పాకిస్థాన్‌కు మాత్రం ఎనిమిది ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయి. ఇక మన వద్ద వీటి సంఖ్య 100 దాటేసింది. చైనా వద్ద అందరికంటే ఎక్కువగా 930కి పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈక్రమంలో మన ఉపగ్రహాలకు పొంచి



ఉన్న ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్రం స్టార్టప్ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఇందుకోసం లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్ శాటిలైట్స్‌ను పంపాలని యోచిస్తోంది. వీటివల్ల భూమి కమాండ్ సెంటర్ల నుంచి తక్షణం చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. వీటితోపాటు భూమిపై భారీ రాడార్లు, టెలిస్కోప్‌లు వంటి వాటితో వ్యవస్థలను ఏర్పాటుచేయాల్సి ఉంటుందని ఇస్రో కెపాసిటీ బిల్డింగ్ ఆఫీస్ మాజీ డైరెక్టర్ సుధీర్‌కుమార్ వెల్లడించారు.

24 గంటలూ కక్ష్యలో జరిగే పరిణామాలను ట్రాక్ చేసే వ్యవస్థలు ప్రస్తుతం మన వద్ద లేవని పేర్కొన్నారు. కొన్ని స్టార్టప్‌లు ఇప్పుడు వాటిపై పనిచేస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ వేళ 400 మంది శాస్త్రవేత్తలు రేయింబవళ్లు పనిచేసి అవసరమైన కీలక సమాచారం సేకరించారు. ఈవిషయాన్ని సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఓ సమావేశంలో ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు.

# క్రాస్ క్లోవర్ లీఫ్ కోసం 127 ఎకరాలు!

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లో బందరు పోర్టు శరవేగంగా రూపుదిద్దు కుంటోంది! దీనికి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారులను విస్తరించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా నేషనల్ హైవే 65, నేషనల్ హైవేలను కలుపుతూ ఒక ప్రత్యేక కూడలిని నిర్మించనున్నారు. దీనివల్ల పోర్టుకు సరుకులు చేరవేయడం సులభమ వుతుంది అంటున్నారు. అంతేకాదు, తెలంగాణ నుంచి కూడా రవాణా మరింత సులువు కానుంది. ఈ ప్రాజెక్టుతో ప్రాంతీయ అభివృద్ధికి బాటలు పడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మరో హైవే విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే బందరు పోర్టు త్వరలో అందుబాటులో కి రానుండటం తో.. ఆ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. అలాగే బందరు పోర్టుకు వెళ్లే రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. నేషనల్ హైవే-65, నేషనల్ హైవే-216 లను పోర్టుకు అనుసంధానం చేస్తారు. దీని కోసం 127 ఎకరాల భూమిని సేకరించనున్నారు.. భూసేకరణపై చర్చించేందుకు జిల్లా మోర్త్ అధికారులు ఢిల్లీ వెళ్లారు.మచిలీపట్నం దగ్గర నేషనల్ హైవే 65, నేషనల్ హైవే- 216 రోడ్లు కలిసే చోట ఒక కూడలిని నిర్మించ నున్నారు. దీని వల్ల పోర్టుకు వెళ్ళే వాహనాలకు ట్రాఫిక్ సమస్య ఉండదు.వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. ఈ కూడలి (క్రాస్ క్లోవర్ లీఫ్) త్వరగా పూర్తయితే అభివృద్ధికి మరింత ఉపయోగపడుతుంది. మచిలీపట్నం బైపాస్ వంతెన దగ్గర ఈ కూడ లిని నాలుగు రింగులతో నిర్మిస్తారు. దీని వల్ల పోర్టుకు వచ్చే వాహనా లు నేరుగా వెళ్ళిపోవచ్చు. ఇతర వాహనాలతో కలిసే అవకాశం ఉండదు. దీని వలన ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. పోర్టు పూర్తయితే ఓడల రాకపోకలు పెరుగుతాయి.. ఈ సమయంలో కూడలి అందుబాటులో కి వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.ఈ కూడలి (జంక్షన్) నిర్మాణం కోసం మూడు గ్రామాల పరిధిలో భూమిని సేకరించనున్నారు.

మొత్తం 127 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఎస్‌ఎన్‌గొల్లపాలెంలో 94 ఎకరాలు, అరిసేపల్లిలో 27 ఎకరాలు, మాచవరంలో 5 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఈ మేరకు సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వాటిని మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్)కు పంపించారు. భూసేక రణ కోసం 3ఏ నోటిఫికేషన్‌ను మరో 15 రోజుల్లో ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.నేషనల్ హైవే 216 ను విస్తరిస్తే తెలంగాణకు బందరు పోర్టుతో సంబంధం ఏర్పడుతుంది.దీనివల్ల భద్రాచలం, ఖమ్మం నుండి గ్రానైట్ రాయిని పోర్టుకుఈజీగా పంపవచ్చు.అమరావతి రాఖీఖీ దగ్గర నుంచేఈ రహదారి వెళ్తుందికాబట్టి రాజధానికి వెళ్లడంసులువు అవుతు ంది. ట్రాఫిక్ సమస్యలు కూడా ఉండవు. నూజివీడు మామిడి పండ్లు, మల్లవల్లిపరిశ్రమల ఉత్పత్తులను తేలికగా రవాణా చేయవచ్చు. ఇది తీర ప్రాంత రహదారి. దీనివల్ల ఆక్వా ఉత్పత్తులను పోర్టుకు ఎగుమతి, దిగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. మొత్తం మీద బందరు పోర్ట్ నిర్మాణంతో హైవే విస్తరణతో పాటుగా అమరావతికి, హైదరాబా ద్‌కు కనెక్టివిటీ మరింత పెరుగుతుంది అంటున్నారు. ఈ పనుల్ని త్వరలోనే ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు అధికారులు.

# వీసా నిబంధనలు మరింత కఠినతరం...!




వాషింగ్టన్,: హెచ్-1బీ వీసా ఫీజును 1 లక్ష డాలర్లకు(రూ. 88 లక్షలు) పెంచిన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ లో మార్పులు తీసుకురానున్నట్లు ప్రకటించింది. అభ్యర్థుల ఎంపిక కోసం ప్రస్తుతం నిర్వహిస్తున్న లాటరీ విధానంలో మార్పులు తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఎక్కువ నైపుణ్యం ఉన్న వారికి, అధిక వేతనాన్ని పొందేవారికి ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. హెచ్-1బీ ఎంపిక కోసం ప్రస్తుతం నిర్వహిస్తున్న లాటరీ విధానాన్ని పక్కనపెట్టి అధిక నైపుణ్యం గల దరఖాస్తుదారులను వీసాలకు ఎంపిక చేయాలని హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (డిహెచ్ఎస్) భావిస్తోంది. అధిక నైపుణ్యం, ఎక్కువ జీతం ఉన్న విదేశీ కార్మికులకే హెచ్-1బీ వీసాలు జారీచేయాలని డీహెచ్ఎస్ ఆలోచిస్తోంది. నైపుణ్యానికి తగ్గట్టుగా వేతనం అన్నతరహాలో వేజ్ లెవల్ 1 నుంచి వేజ్ లెవల్ 4వరకు నాలుగు విభాగాలుగా విడగొట్టి ప్రాధాన్యతా క్రమంలో వీసాలు జారీచేయాలన్నది ప్రభుత్వ ప్రతిపాదన. ఉదాహరణకు వేజ్ లెవల్4లో ఉన్న అభ్యర్థి పేరు నాలుగు విభాగాలలోనూ ఉంటుంది. అదే వేజ్ లెవల్1లో ఉన్న అభ్యర్థి పేరు ఒకటే విభాగంలో ఉంటుంది.

ఆ రెండు వీసాలపై కంపెనీల దృష్టి:

ట్రంప్ ప్రభుత్వం కొత్తగా పెంచిన హెచ్-1బీ వీసాల ఫీజు కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలపై టెక్ కంపెనీలు దృష్టిసారించాయి. హెచ్-1బీతో పోలిస్తే మరింత తక్కువ ధరకు అందుబాటులో ఉన్న ఎల్1(అంతర్ కంపెనీ బదిలీలు), ఓ1(అసాధారణ నైపుణ్యాలు) వీసా క్యాటగిరీలకు ఇక డిమాండు పెరిగే అవకాశం ఉందని అవి అంచనా వేస్తున్నాయి.ఓ1,ఎల్1 క్యాటగిరీలకు అత్యంత కఠినమైనఅర్హతా నిబంధనలు ఉండడమేగాక ఇవి హెచ్-1బీ వీసాలను పూర్తిగా భర్తీచేయలేవు. అయితే కంపెనీలు మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చికొత్త ఉద్యోగ నియామ కాలలో ఈమార్గాలను ఎంచుకునే అవకాశం అధికంగా ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**ఓ1 వీసాలకు లాటరీ పద్ధతి లేదు..:** ఉదాహరణకు, ఓ1 క్యాటగిరీనే తీసుకుంటే ఏడాదికి సగటున 12,000 డాలర్ల(రూ. 10.64 లక్షలు) ఫీజు ఉండగా హెచ్-1బీ వీసా ఫీజులో ఇది ఎనిమిదవ వంతు మాత్రమే. హెచ్-1బీ వీసాలను గరిష్ఠంగా 85,000 మాత్రమే కేటాయిస్తుండగా తిరస్కరణ రేటు 73 శాతం ఉంది. అంతేగాక ఓ1 వీసాలకు లాటరీ పద్ధతి లేదు. కేవలం నైపుణ్యం ఆధారంగానే జారీచేస్తారు. దీనివల్ల యాజమాన్యాలకు డబ్బు ఆదా కావడమేగాక తాము నిపుణులమని రుజువు చేసుకున్న వారికి మాత్రమే అవి దరఖాస్తులు దాఖలు చేయగలవు. అంతేగాక హెచ్-1బీ మాదిరిగా కాకుండా వీసా గడువును 6 సంవత్సరాలకు మించి పొడిగించుకునే అవకాశం దీంట్లో ఉంటుంది. ఓ1 వీసాలు కంపెనీల విశ్వసనీయత ను పెంపొందించడమే గాకుండా ఈబీ-1ఏ గ్రీన్‌కార్డుకు మెట్టుగా ఉపయోగపడుతుందని అమెరికాకు చెందిన ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ జినీ గ్రీన్ కార్డు వ్యవస్థాపకుడు సాహిల్ న్యాతి తెలిపారు. ఎల్1ఫీజు హెచ్1బీలో పదో వంతు మాత్రమే..: ఎల్1 విషయానికి వస్తే ఇది పూర్తిగా యాజమాన్యం పరిధిలో ఉండే క్యాటగిరీ. దీని ఫీజు ఏడాదికి 7,000 డాలర్లు (రూ.6.21 లక్షలు) ఉంటుంది. ఇది హెచ్-1బీ ఫీజులో కేవలం 10వ వంతు మాత్రమే. 2024ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఆమోదించిన అన్నిఎల్1 దరఖాస్తులలో 26 శాతం (71,799) భారతీయులవే కావడం విశేషం. అదే ఆర్థికసంవత్సరంలో ఓ1క్యాటగిరీ కింద మొత్తం19,457 వీసాలు జారీ కాగా భారతీయులు 8 శాతం మంది ఉన్నారు. ఏదేమైనప్పటికీ ఈ రెండు క్యాటగిరీలు హెచ్-1బీకి ప్రత్యక్షంగా ప్రత్యామ్నాయం కాబోవని సింఘానియా అండ్ కో మేనేజింగ్ పార్ట్‌నర్ రోహిత్ జైన్ తెలిపారు. ఎల్1 వీసాకు అర్హత సాధించాలంటే ఓ కంపెనీకి చెందిన అంతర్జాతీయ శాఖలో కనీసం మూడేళ్లు పనిచేసి ఉండాల్సి ఉంటుంది.

## కల్లెడలో యూరియా కష్టాలు!

**వరంగల్,తెలంగాణ దిశ:** యూరియా బస్తాలకోసం పడిగాపులు కాస్తున్న రైతులను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందనని ఆవేదన వ్యక్తం చేశారు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. నెలలు గడుస్తున్న రైతుల యూరియా కష్టాలు తీరడం లేదని.. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తో రైతులురాష్ట్రంలో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని ఎర్రబెల్లి అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ సొసైటీ వద్ద ఉదయం నాలుగు గంటల నుంచి యూరియా బస్తాల కోసం వేచి ఉన్నరైతులతో ఎర్రబెల్లి మాట్లాడారు. వారి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ అంటేనే కష్టాలకు కేరాఫ్ అంటూ ఘాటు విమర్శలు గుప్పించా రు.పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రైతులు రాజులుగా బతికారని సాగు నీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంటసాయం, నిరంతరాయ విద్యుత్తు అందించామని ఎర్రబెల్లి గుర్తు చేశారు.

## నిండా ముంచిన నకిలీ విత్తనాలు

**వరంగల్,తెలంగాణ దిశ :** నకిలీ మొక్కజొన్న విత్తనాలు తమను నిండా ముంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫెర్టిలైజర్ షాపు యజమాని మాయమా టలు విని విత్తనాలు కొన్న తమకు తీరని అన్యాయం జరిగిందని బాధిత రైతులు కన్నీటి పర్యంతమైన విషాదఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన రైతులు మౌర్య పవన్ సింగ్ 3 ఎక రాలు, బానోతు యాకుబ్ 2 ఎకరాల, బానోతు సహదేవ్2 ఎకరాలు ఇలా ముగ్గురు రైతులకు ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామంలో తెలిసినవారు ఉండటంతో అక్కడి ప్రైవేటు దుకాణాల్లో డికాల్బ్ డీకేసీ 9178 రకం మొక్కజొన్న విత్తనాల పాకెట్స్ 1850 చొప్పున 14 సంచులు కొనుగోలు చేశారు.

ఏడెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో కంకులు రావడం లేదని, ఖాళీ బెండ్లు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం న్నారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయా మని,పరిహారం అందించి ఆదుకోవాలని సదరు రైతులు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. నకిలీ విత్తనాలకు పెట్టిన పెట్టుబడితో తీవ్రంగా నష్టపో యామని రైతులు తమ గోడును వెలబోసుకున్నారు.




# కంటి తుడుపేనా!

ఏళ్ల తరబడి ప్రజలను పీల్చి పిప్పి చేసినఅనంతరం వస్తు సేవల పన్ను విధానం (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్-జిఎస్టి)లో కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకువచ్చిన మార్పుల తీరు వాత పెట్టినవాడే వెన్న పూసినట్టుగా ఉంది. ఈచర్యతో భారీ మొత్తంలో పన్నులు తగ్గాయని, సామాన్యులు పండగ చేసుకోవచ్చని పాలకులు చెబుతున్నప్పటికీ వాటిఫలితాలు సామాన్యులకు అందడంపై సందేహాలు నెలకొన్నాయి. ఎన్‌డిఎ కూటమి లో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీని అభినందిస్తూ అసెంబ్లీ ఉభయ సభల్లోనూ తీర్మానాలు చేసింది. శాసన సభలో జిఎస్టి 2.0వల్ల కలిగే ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ ప్రసంగం చేశారు. అయితే, ప్రధాని నరేంద్రమోడీగానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ ఇన్ని సంవత్సరాల పాటు ప్రజలపై మోపిన భారాన్ని గురించి ఒక్క మాట కూడామాట్లాడకపోవడం గమనార్హం. అలాగే ఒక కుటుంబానికి కలిగే ప్రయోజనం ఎంతో కూడా వారు చెప్పలేదు. నిజానికి, ఏ వస్తువుపై ఎంత ధర తగ్గుతుందన్న నిర్దిష్టమైన వివరాలను కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించలేదు. బహుళ, పరోక్ష పన్నుల విధానం స్థానంలో ఏకీకృత పన్ను అని చెబుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం జిఎస్టిని 2017లో దేశంపైరుద్దింది నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ మే కావడం గమనార్హం! కొన్ని దశాబ్దాలుగా అనుసరించిన ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా సామాన్యుడి కొనుగోలు శక్తి గణనీంగా తగ్గింది. జిఎస్టిలో ఉన్న సంక్లిష్టత, అపరిమిత శ్లాబుల కారణంగా నిత్యావసర ధరలు భారీగా పెరిగి దేశ వ్యాప్తంగా గగ్గోలు రేగింది. ప్ర తిపక్షాలు దీనిని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించాయి. మరోవైపు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా తగ్గాయి. అదేసమయంలో ట్రంప్ టారిఫ్‌ల ప్రభావమూ పడింది. దీంతో ప్రజల ప్రయోజనాలు ఎలా ఉన్నప్పటికీ కార్పొరేట్ల కోసమైనా దేశీయ మార్కెట్‌ను పెంచడం కోసం జిఎస్టిని తగ్గించక తప్పనిస్థితి ఏర్పడింది. పోనీ,ఈ పేరుతోనైనా జిఎస్టి ప్రయోజనాలను పూర్తిగా పేదలకు అందిస్తున్నారా అంటే అదీ లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 55లక్షల కోట్ల రూపాయలను గత ఏడు సంవత్సరాల్లో జిఎస్టి ద్వారా ప్రజల మూలుగలు పిండి మోడీ సర్కారు వసూలు చేసింది. అప్పుడే పుట్టిన శిశువు నుండి,తుది శ్వాస విడిచిన వారి వరకు ఏవరినీ వదలని స్థితి! ఇప్పుడు తాజా సంస్కరణల కారణంగా జరిగే తగ్గింపు విలువ గరిష్టంగా 2.25లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా! అంటే సామాన్యుడి నుండి పిండినదెంత?ఇప్పుడు తగ్గిస్తున్నదెంత?ఇడ్లీ, దోశలను పట్టించుకోని కేంద్ర పాలకులు చపాతీ, పరోటాలపై మాత్రం జిఎస్టిని తగ్గించారు. దీని వెనుక బీహార్ ఎన్నికల ప్రయోజనాలు ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జమోటా, స్విగ్గీవంటి ఫుడ్ డెలివరీ సంస్థల సేవలను 18శాతం పన్నుల శ్లాబులో చేర్చారు. దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించే చేనేత రంగానికి అవసరమయ్యే ముడి సరుకులను అదే శ్లాబులో ఉంచారు. కొన్ని రకాల ఔషధాలను జీరో శ్లాబులో ఉంచినట్లు చెబుతున్నప్పటికి, వాటి తయారీకవసరమైన ముడి పదార్థాలపై పన్ను విధించారు. జిఎస్టి అమలులోకి వచ్చిన 24 గంటల తరువాత కూడా పాలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. పాత స్టాక్‌కు తగ్గింపు వర్తించదని అంటున్నారు. పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను కొద్దిరోజుల కిందటే పెంచాయి. వీటిపై జిఎస్టిని తగ్గించినా,పెద్దగా ఫలితం లేదు. సామాన్యుడికి ప్రయోజనం కలిగించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్నా జిఎస్టి రేట్ల తగ్గింపు వివరాలను నిర్దిష్టంగా సరుకుల వారీగా ప్రకటించాలి. జిఎస్టి తగ్గక ముందు ఉన్న ధర, తగ్గిన తరువాత ఉన్న ధరల వివరాలను నిర్దిష్టంగా వెల్లడించాలి. అలాగే జిఎస్టి తగ్గింపు ఒక్కటేచాలదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి అవసరమైన ఇతర చర్యలు నిజ వేతనాల పెంపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే దేశీయ ఉత్పత్తులకు, ఎంఎస్ఎంఇల కు ఊతం లభిస్తుంది. స్వావలంబన దిశలో అడుగులు పడతాయి.

# గజం మిథ్య ! పలాయనం మిథ్య..!



ఆఫీసు నుంచి బైటపడి ఇంటి దారి పట్టేను. ఇంటి గుమ్మంలో మా పుత్రరత్నం చాలా సీరియస్‌గా "అంతా మిథ్య తలంచి చూచిన నరుండెట్లౌ.." అనుకుంటూ దీక్షగా తెలుగు పద్యాన్ని చదివేస్తున్నాడు. వీడికి అసలు తెలుగు సబ్జెక్టే లేదు. ఎప్పుడన్నా "ఒరే! తెలుగు పద్యం నేర్చుకోరా" అని బతిమిలాడినా, "ఇట్ ఈజ్ టోటల్ వేస్ట్ ఆఫ్ టైమ్ డాడ్!" అనేవాడు. ఇప్పుడు వీడికేమైంది? ఆశ్చర్యపడిపోయేస్తూ గదిలోకి అడుగుపెట్టాను. ఇల్లంతా అగరుబత్తీల సుగంధ పరిమణాలు విరజిమ్ముతోంది! ఇది మరీ ఆశ్చర్యం! లోపల వంటగది లోంచి మంద్ర స్వరంతో సతీమణి కూనిరాగం వినిపించింది. ఎంత మనోజ్ఞ దృశ్యం! గదిలోకి అడుగుపెట్టాను. నాకేసి తల తిప్పి చూసి ఓ చిరునవ్వు అలవోకగా విసిరి పారేసి, "అంతా భ్రాంతియేనా, జీవితానా వెలుగింతేనా" అని బొత్తిగా ఆ సందర్భానికీ, వాతావరణానికీ అతకని పాట అందుకుంది. "ఏమైంది నీకు?" అని అడగబోయేనో లేదో, నోటి మీద వేలుంచుకుని సైలెన్స్ అన్నట్టు సైగ చేసి మా బెడ్రూం కేసి చేయి చూపించింది. వెళ్లి చూద్దును కదా! బుర్ర తిరిగిపోయింది. అక్కడ ఓ స్వామీజీ మఠం వేసుకుని కూర్చుని మౌనంగా ఏదో తీర్థం సేవిస్తున్నాడు. అతడి పక్కన మరో ఆడ స్వామి కూడా కూర్చుని ఆమె కూడా తీర్థ సేవన సాగిస్తోంది. వాళ్ళ పాదాల దగ్గర ముగ్గురు ఉన్నారు. ఆ ముగ్గుర్లోకీ చిన్నవాడిలా ఉన్నతను దాదాపు సాష్టాంగం పడి లేవడం లేదు. తక్కిన ఇద్దరూ ఆ స్వామీజీ పాదసేవ చేస్తున్నారు. "ఎవరు వీళ్ళు? నా ఇంటికి ఎలా వచ్చేరు? ఎందుకు వచ్చేరు?" వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి అన్నట్టు నా సతీమణి నా రెక్క పుచ్చుకుని అక్కడి నుంచి ఇవతలికి హాల్లోకి లాగి కుర్చీలో కుదేసింది. చేతిలో కాఫీ కప్పు పెట్టి దానిని తాగి నేను కాస్త కుదుట బడేందుకు ప్రయత్నిస్తూంటే అప్పుడు నెమ్మదిగా చెప్పుకొచ్చింది. ఆ రోజు గుడికి వెళ్ళినప్పుడు అక్కడ ఈ స్వాములు తారసిల్లేరట. పూజారి వాళ్ళని పరిచయం చేసేడట. వారికి ఒక పగలు, ఒక రాత్రి ఆతిథ్యం ఇచ్చి సేవించుకుంటే మనం కోరుకున్నవన్నీ నెరవేరేట్టు ఆశీర్వదిస్తారట. అందుకే వెంటనే వాళ్ళని తాను ముందు మనింటికే ఆహ్వానించిందట. అదృష్టం! స్వామీజీ వెంటనే అందుకు సమ్మతించేరట. ఇక మన పంట పండినట్టేనట. ఇంతకీ వీళ్ళెక్కడి స్వాములు? అనడిగేలోపు వాళ్ళ పరిచయం కాస్తా చెప్పేసింది. పూజ్య స్వామీజీ నరేంద్ర మిథ్యా స్వామి ఆ పెద్ద స్వామి పేరు. అతడి ప్రథమ శిష్యురాలు పూజ్య నిర్మలాభ్రాంతి స్వామి చాలా మేధావి ట. కింద సేవ చేస్తున్న ముగ్గురూ మన తెలుగు స్వాములేనట. సాష్టాంగపడి వున్న ఆ స్వామి పూజ్య పవన కల్యాణ చిత్తభ్రాంతి స్వామి. ఇక ఎడమ కాలు పడుతున్నది పూజ్య చంద్ర మిథ్యా స్వామి, కుడికాలు పట్టుకున్నది పూజ్య జగన్నాటక భ్రాంతి స్వామి నట. గదిలోంచి గంట మోగింది. సతీమణి పరిగెత్తుకెళ్ళింది. చాటంత ముఖంతో బైటకొచ్చి ఐదు నిమిషాల్లో శుద్ధిగా తయారై స్వామీజీ ముందు కుటుంబం యావత్తూ కూర్చోవాలని ఆదేశం అయిందట. ఉపదేశం ఇస్తారట. గబగబాస్నానం చేసి ఓ పంచె కట్టి పైన ఓ తువ్వాలు వేసుకుని గదిలోకి వెళ్ళాను. పెద్ద స్వామీజీ రెండు కాళ్ళూ ముందుకు సాచేడు. నా సతీమణి నన్ను ఆ పాదాల మీదకి తోసింది. అప్పుడు అర్థమై కాళ్ళకి మొక్కేను. అప్పుడు స్వామి కరుణించి చిరునవ్వు చిందించేడు. అప్పుడు నిర్మలాభ్రాంతి స్వామి గంట మోగించింది. పెద్ద స్వామి నోరిప్పేడు. "నీ వాలకం చూస్తూంటే నీకేవో సందేహాలున్నట్టు అనిపిస్తోంది. వెనకాడకుండా అడిగేరు నాయనా !" అన్నాడు. ఇక ఉండబట్టలేకపోయాను. "స్వామీ, ఏదో అజ్ఞానిని, మీ అందరి పేర్లలో భ్రాంతి లేదా మిథ్య అన్న పదాలు ఉన్నాయి. ఎందుకున్నాయో బోధపడకు గింజుకుంటున్నాను. కాస్త దానిగురించి శలవియ్యండి." అని కోరేను. "నువ్వు నిజంగా సూక్ష్మబుద్ధివిరా. నీకు జ్ఞానయోగం ఉపదేశిస్తాను విను." అని ఆరంభించేడు. "ఈ ప్రపంచం అంతా కేవలం ఒక మాయ. భగవంతుడి మాయ. ఆ సంగతి బోధపడకే జీవులంతా ఆ మాయనే నిజం అనుకుని భ్రాంతి చెంది అన్ని రకాల కష్టాలకూ గురౌతున్నారు. నిజానికి ఆ కష్టాలు కూడా భ్రాంతే. నీకు వివరంగా బోధపడాలంటే శంకరాచార్యులవారి ఉదంతం చెప్పాలి. ఓసారి ఆచార్యులవారు ఆశ్రమం ఆవరణలోని చెట్టు కింద కూర్చునివున్నప్పుడు అటుకేసి ఓ ఏనుగు వచ్చిందట." అని స్వామీజీ అనగానే మావాడు "అవును, ఆ స్టోరీ మా స్కూల్లో టీచర్ ఎప్పుడో చెప్పేశారు. అప్పటినుంచీ మాకు ఈ ర్యాంకులన్నీ ఒట్టి భ్రమే అని అర్థం అయిపోయింది." అని గబుక్కున నోటికి వచ్చినట్టు మాట్లాడేశాడు. స్వామీజీకి కోపం వచ్చిందేమో అనుకున్నాను. కాని ఆయన స్వామీజీ కదా. అందుచేత చిరునవ్వుతో నా పుత్రరత్నాన్ని అభినందించేడు. వాడు తండ్రికి తగ్గ తనయుడని అభినందించేడు. ఆ తర్వాత తన జ్ఞానబోధ కొనసాగించేడు. ఐతే ఈసారి ఇక కథల జోలికి పోలేదు. ఓ గంట సేపు స్వామి చేసిన బోధనలను విన్నాను. తక్కిన స్వామిగణం అంతా ఆ బోధనలకు తన్మయులైపోయి (రోజూ వింటున్నా వారికి ఆ తన్మయత్వం ఎందుకొచ్చిందో మరి) ఊగుతున్నారు. ఆ తర్వాత నిర్మలాభ్రాంతి స్వామి మళ్ళీ గంట మోగించింది. అప్పుడు పెద్ద స్వామి మళ్ళీ మౌన ముద్ర దాల్చేరు. వెంటనే పవన కల్యాణ చిత్త భ్రాంతి స్వామి ఆయన కాళ్ళ మీద పడిపోయి అలాగే ఉండిపోయేడు. చంద్ర మిథ్యా స్వామి, జగన్నాటక భ్రాంతి స్వామి ఎవరి వాటా కాలును వాళ్ళు ఒత్తడం మొదలెట్టేరు. ఆ రాత్రి తెల్లారాక స్వాములంతా మా కుటుంబాన్ని ఆశీర్వదించి బైటకు వేంచేసేరు. నేను నిన్న రాత్రి బోధనల తన్మయత్వంలోనే ఉన్నాను, ఆ సరికి పక్కింటి సుబ్బారావు రోజూలాగానే చేత్తో ఓ పేపరు పట్టుకుని వొచ్చేడు. ఇన్నాళ్ళూ అతగాడినుంచి నాకు తెలియని, బోధపడని విషయాలను తెలుసుకుంటూ వుండేవాడిని. ఈ రోజు నుంచి నాకా ఆవసరం లేదని సుబ్బారావుకి పాపం, తెలియ దుగా. అందుకని మామూలుగానే వచ్చీసేడు. కాని మామూలుగా ఇంట్లోంచి రావలిసిన కాఫీ రాలేదు. కాస్త అయోమయంలో పడినా, సర్దుకుని పేపర్ తెరిచేడు సుబ్బారావు. "హిండెన్‌బర్గ్ రిపోర్టులో ఆరోపించినట్టు అదానీ కంపెనీలు ఏవీ ఎటువంటి అవకతవకలకూ పాల్పడలేదు అని సెబి రిపోర్టు ఇచ్చింది." అన్నాడు."ఏమిటా రిపోర్టు? ఏమా కథ?" అని నేను మామూలుగానైతే అడగాలి. సుబ్బారావు కూడా అదే ఎక్స్‌పెక్ట్ చేసినట్టున్నాడు. కాని నేను చిరునవ్వు తో " అవును. అదంతా మిథ్య" అన్నాను. సుబ్బారావు బుర్ర తిరిగిపోయింది.

కాని తమాయించుకుని 'రైతులు యూరియా వాడకం తగ్గించేస్తేనే వారికి మేలు అన్న చంద్రబాబు అని చదివేడు. 'అవును, అసలు యూరియా యేపెద్ద భ్రాంతి" అన్నాను. సుబ్బారావు నా సంగతి అర్థం కాక బుర్ర గోక్కున్నాడు. వోటర్ల లిస్టుల్లో పెద్ద సంఖ్యలో పేర్లు గల్లంతు వెనక కుట్ర ఉందని రాహుల్ గాంధీ ఆరోపణ అని చదివేడు. "అసలు వోటే మిథ్య. అది గల్లంతైందనుకోవడం మన భ్రాంతి" అన్నాను. ఇక సుబ్బారావు పేపర్ని మడిచిపెట్టుకుని వాళ్ళ ఇంటికి చకచకా వెళ్ళిపోయేడు. ఇంతలో నా సతీమణి వచ్చి "ఏమండీ! ఆఫీసుకి తయారు అవరా? టైమవుతోంది" అంది. "పిచ్చిదానా! ఆఫీసేవిఁటి? ఉద్యోగం ఏవిఁటి? అంతా మిథ్య అని తెలుసుకోలేకపోతున్నావు." అన్నాను. "అవున్నాన్నా, నీఆఫీసు మాటేవిఁటో గాని నా స్కూలు మాత్రం ఖచ్చితంగా మిథ్యే" అని నా పుత్రరత్నం క్రికెట్ బ్యాట్ పుచ్చుకుని వీథిలోకి పరిగెత్తేడు. వాడి జ్ఞానానికి నేను ముచ్చట పడ్డాను. కాసేపు తర్వాత సతీమణి వచ్చి "నాదసరాచీర ఏం చేశారు?" అనడిగింది. "నిన్న ఒక రోజు రోజంతా సేవ చేసినా నీకు జ్ఞానోదయం కలగలేదేవిఁటే? దసరా మిథ్య, చీర భ్రాంతి. పైగా ఆ చీరని నేను కొనితేవాలనుకోవడం డబుల్ మిథ్య, త్రిబుల్ భ్రాంతి" అన్నాను. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియలేదు. మళ్ళీ తెలివి వచ్చేసరికి నేను ఏదో ఆస్పత్రిలో ఉన్నాను. కాస్సేపట్లో డాక్టర్ గారు వచ్చేరు. "ఏం సార్! ఎప్పటినుంచీ మీకిట్లా అనిపిస్తోంది?" అని అడిగేరు. "నేనిక్కడ ఎందుకు ఉన్నాను? నాకేమైంది?ఏమిటీమాయ?" అని అడిగేను. "ఆ!అదే అదే! ఈ మాయ, భ్రాంతివంటి ఆలోచనలు ఎప్పటి నుంచి?" అని డాక్టర్ గారు మళ్ళీ అడిగేరు. "నాకు నిన్ననే జ్ఞానోదయం అయింది డాక్టరు గారూ ! నాకేమీ జబ్బు లేదు. నన్ను ఇంటికి పోనివ్వండి" అంటూ మంచం మీదనుంచి లేవబోయాను. వెంటనే ఇద్దరు దుక్కలా ఉన్న అటెండెంట్లు నన్ను కదలకుండా పట్టుకున్నారు. డాక్టరు గారు నా సతీమణితో "జబ్బు తీవ్రత ఎక్కువగా ఉందమ్మా. ముందు ఆ స్వాముల సంగతి వెంటనే తేల్చకపోతే ఇలాంటి పేషెంట్లు ఇంకా చాలామంది తయారయ్యే ప్రమాదం ఉంది. ముందు ఆ సంగతి చూడాలి. కొన్నాళ్ళు ఇతగాడిని ఇక్కడే ఉండనివ్వండి." అంటున్నాడు. "అంతా భ్రాంతి, జగన్మిథ్య, ప్రపంచ బ్యాంకే సర్వస్వం" అన్న చంద్ర మిథ్యా స్వామి పలుకులని, "అదానీ సత్యం, భారతదేశం భ్రాంతి" అన్న నరేంద్ర మిథ్యా స్వామి మంత్రాన్ని, "నరేంద్ర స్వామిని నమ్ముకో. నీకు అదే ముక్తి" అన్న జగన్నాటక భ్రాంతి స్వామి సలహాని, "సనాతనత్వం అంటే ఇదే అని తెలుసుకో" అన్న పవనకల్యాణ చిత్త భ్రాంతి స్వామి సందేశాన్ని, చివర్లో నా చెవిలో "పేదరికంభ్రాంతి, జిడిపి యే సత్యం"అన్న నిర్మాలానంద భ్రాంతి స్వామి ఉపదేశించిన మంత్రాన్ని స్మరించుకుంటూ గడిపేస్తున్నాను. మీరూ ఈ జ్ఞానాన్ని గ్రహించి దు:ఖాల నుండి బైట పడండి మరి!



## జాయింట్ వెంచర్ గా మెట్రోరైల్ ప్రాజెక్టు..

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెట్రో రైల్ ప్రాజెక్టులనువేగంగా పూర్తి చేయడానికి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ టెండర్లలో భాగస్వామ్యం కోసం జాయింట్ వెంచర్స్ (ఏఎ) కు అవకాశం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ప్రీబిడ్డింగ్ మీటింగ్ కు హాజరైన కాంట్రాక్ట్ సంస్థల నుంచి వచ్చిన వినతితో ఈ నిర్ణయం తీసుకున్నారు. వీటిలో గరిష్టంగా 3 కంపెనీలు కలసి టెండర్‌ను వేయడానికి అనుమతించను న్నారు. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్పీ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు, ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తాయి. విశాఖ మెట్రో టె ండర్లకు అక్టోబర్ 10, విజయవాడ మెట్రో టెండర్లకు అక్టోబర్ 14 వ తేదీ తుది గడువు విధించారు.ఇటీవల జరిగిన అధ్యయనాల ప్రకారం చిన్న చిన్న ప్యాకేజీలుగా విశాఖ, విజయవాడ మెట్రో రైలు పనులను విభజించడం వల్ల ప్రాజెక్ట్ నిర్మాణంలో ఆలస్యం జరుగుతుందని అధికా రులు భావిస్తున్నారు. దీనివల్ల నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరుగు తుంది. అందువల్ల, జాయింట్ వెంచర్స్ విధానానికి అవకాశం ఇచ్చారు. ఈ మెట్రో ప్రాజెక్టులను రికార్డు టైమ్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా, పనులను పెద్ద ప్యాకేజీలుగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మెట్రో ఫేజ్-1లో విశాఖపట్నంలో 46.23 కిలోమీటర్లు, విజయవాడలో 38 కిలోమీటర్లు మెట్రో సివిల్ పనులకు అంతర్జాతీయ స్థాయిలో టెండర్లుఆహ్వానించారు. విశాఖపట్నం మెట్రో టెండర్ల దాఖలుకు అక్టోబర్ 10వ తేదీ, విజయవాడ టెండర్లకు అక్టోబర్ 14వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జాయింట్ వెంచర్ నిర్ణయాలతో ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.విజయవాడ, విశాఖల్లో మెట్రోలకు ఏపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నాయి. మొత్తం రూ.21,616 కోట్లతోవిశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల కు టెండర్లకు ఇటీవల అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా రూ.10,118 కోట్లతో విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు, రూ.11,498 కోట్లతో విశాఖ మెట్రో రైలుకు టెండర్లు ఆహ్వానించింది. ఈ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులను జాయింట్ వెంచర్స్ కు అవకాశం కల్పించింది. విశాఖ మెట్రోకు ఏపీ ప్రభుత్వ వాటాగా రూ.4,101 కోట్లు, సీఆర్డీఏ నుంచి విజయవాడ మెట్రోకు రూ. 3,497 కోట్లు ఇస్తారు. విశాఖ మెట్రోకు వీఎంఆర్డీఏ నుంచి నిధులు కేటాయిస్తారు. విజయవాడ మెట్రో రైలు పొడవు మొత్తం 66.15 కి.మీ, ఇందులో ఫేజ్-1 ప్రాజెక్టు 38.40 కిలోమీటర్లు, రెండు కారిడార్లుగా నిర్మించనున్నారు. గన్నవరం నుంచి పండిత్ నెహ్రూ బస్ స్టేషన్ వరకు 25.95 కి.మీ ఒక కారిడార్, నెహ్రూ బస్ స్టేషన్ నుంచి పెనమలూరు వరకు 12.45 కి.మీ రెండో కారిడార్ గా నిర్మించనున్నారు. ఫేజ్-1లో మొత్తం 34 స్టేషన్లు, అన్నీ ఎలివేటెడ్‌గా ఉండనున్నాయి. విజయవాడలో 66 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ మెట్రో రైలు ప్రాజెక్టు చేపడుతున్నారు. విశాఖపట్నం మెట్రో రైలు పొడవు 76.90 కిలోమీటర్లు. ఫేజ్-1 ప్రాజెక్టు 46.23 కిలోమీటర్లు. మొత్తం 3 కారిడార్లు ఉంటుంది. స్టీల్ ప్లాంట్ జంక్షన్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 29 స్టేషన్లు, 34.40 కి.మీ మొదటి కారిడార్, గురుద్వారా నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకు 6 స్టేషన్లు 08 కి.మీ. రెండో కారిడార్. తాటిచెట్లపాలెం నుంచి చిన్న వాల్తేర్ వరకు 7 స్టేషన్లు 6.75 కి.మీ, మూడో కారిడార్ గా చేపడతారు. మొత్తం విశాఖలో 76.90 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ మెట్రో రైలు నిర్మించనున్నారు.

# వర్మ మౌనం వెనుక వ్యూహం..!



**కాకినాడ,తెలంగాణ దిశ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఏ అధికారిక కార్యక్రమా ల్లోనూ ఒక్క వర్మ తప్ప తెలుగు దేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎందుకు కనిపించడం లేదు. దీనికి బదులు దొరకని ప్రశ్నగా పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి కనిపిస్తోంది. మన అనే భావన ఉంటే ఎంతదూరమైనా వెళ్తాం.. తీరా అక్కడకు వెళ్లాక ఎవ్వరూ పట్టించు కోకపోతే.. కనీసం పలుకరింపునకు కూడా నోచుకోకపోతే.. అక్కడ ఇమడలేని పరిస్థితి ఎదురవుతుంది.. ఆరోజు ఏదోలా సమయం గడిపి రేపన్నాక వెళ్లేందుకు కూడా ఇష్టపడం..సరిగ్గా ఇలానే ఉందట పిఠా పురం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల పరిస్థితి. పిలవని పేరంటాని కి మనదే కదా అని వెళితే కనీస గుర్తింపు లేని చోట ఇమడలేక.. అటు బయట చెప్పుకోలేక సతమతమవుతు న్నారట పిఠాపురంలోని తెలుగు తమ్ముళ్లు. నియోజకవర్గ నాయకునితో చెప్పుకుందామంటే కొన్ని సందర్భాల్లో ఆయనకే ఏమీ తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నా రని, ఇక ఆయన మాకే న్యాయం చేస్తాడని లోలోన మధన పడిపోతున్నా రట.. పై అధిష్టానికి చెప్పుకుందామంటూ ఇదంతా కావాలనే వర్మ చేస్తున్నారా అన్న ప్రచారంతో ముందుకు అడుగు పడక తెగ ఫీల్ అయిపోతున్నారట. కేడర్ పరిస్థితి ఇలా ఉంటే ఇక టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్మ పరిస్థితి మరో విధంగా ఉంది. ప్రాధాన్యత లేకుండా పోయిన తెలుగు తమ్ముళ్లను సంతృప్తి పరచలేక.. మరోపక్క అధిష్టానాన్ని ప్రశ్నించలేక సంకట పరిస్థితిని ఎదుర్కొంటున్నారట. మొత్తంమీద పిఠాపురం కూటమిలో మాత్రం నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితి ఎప్పుడు లావా మాదిరి ఉప్పొంగుతుందా అనేలా పరిస్థితి ఉందని అర్థం అవుతుంది..పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో తెలుగుదేశం పార్టీకి సంకట పరిస్థితి ఎదుర్కొంటుందా అన్న ప్రశ్నకు టీడీపీ కార్యకర్తలు ఔననే సమాధానం చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్నప అధికారిక కార్యక్రమాలకు తెలుగు తమ్ముళ్లకు ఏ కబురు ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో ఆది నుంచి టిడిపి వర్సెస్ జనసేనగానే పరిస్థితి ఉంది. తొలినాళ్లలో వర్మకు సీటు విషయంలో అలజడి రేగిన తర్వాత చంద్రబాబు హామీతో ఆయన వెనక్కి తగ్గి పవన్‌కు మద్దతు నిలిచారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలలో పవన్ వెంటే నడుస్తోన్న వర్మ పలు సందర్భాల్లో చేదు అనుభవాల్ని ఎదుర్కొన్న పరిస్థితి కనిపించింది. అయితే తన అసహనాన్ని ఏ మాత్రం బయటపడకుండా జాగ్రత్త పడ్డ వర్మ తన వెంట ఉండే పార్టీ నాయకులకు దక్కని గౌరవంపై మాత్రం చాలా అసంతృప్తిలో ఉన్నారన్నది ఆయన అనుచరుల మాట. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో మాత్రం ముందునుంచీ ఉన్నట్లే టిడిపి-జనసేన మధ్య ఎడమోహం పెడమోహంగానే ఉంది పరిస్థితి. మూడు పార్టీలు కలిసి చేసిన కార్యక్రమాల్లో కనీసం పట్టుమని పది మంది టీడీపీ నాయకులు లేని విధంగా పరిస్థితి మారింది. పదవుల పంపకాల్లో అధిష్టానమే అన్ని లెక్కలు చూస్తోందని సర్దుకు పోతున్నా.. ఆఖరికి ఎవరికి ఏ పదవి వచ్చినా సర్దుకుపోతున్నారట. ఎందుకంటే పాలనపెత్తనంలో తమకు ఎటువంటి అవకాశం ఇవ్వడం లేదన్న నిస్తేజ ంలో అసలు మాకు పదవుందా.. అని ప్రశ్నిస్తూ టిడిపి నేతలు బాహాట ంగా విమర్శిస్తున్నారు. దీనిపై వర్మ ఎన్నిసార్లు అధిష్టానం దృష్టికి తీసు కెళ్లినా ఫలితం లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.పిఠాపురం పేరు చెబితే ప్రస్తుతం పవన్ మాటే వినిపిస్తోంది. దీంతో టిడిపిని నమ్ముకున్న వారికి కేవలం టిడిపి ప్రచార కార్యక్రమాలు తప్పితే పథకాలు, వాటి అమలకు సంబంధించి అధికారికంగా కబుర్లు రావడం లేదని టిడిపి నేతలే చెబుతున్నారు. తమ అధినాయకుడు నిత్యం టెలికాన్ఫరెన్స్ లలో కబుర్లు తప్పితే తమకు ఎటువంటి అవకాశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పురుషోత్తపట్నం వాటర్ పంపింగ్ ప్రారంభానికి పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జి వర్మకు ఎటువంటి కబురు రాలేదు. పిఠాపురం జైగణేష్ ఆలయ ఉత్సవాలకు సంబంధించి ఛైర్మన్ అభ్యర్థిగా ఉన్న టిడిపి సీనియర్ నేత కొరుప్రోలు శ్రీనుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జనసేన నేతలే సమీక్ష నిర్వహించేశారు. దీనిపై కొరుప్రోలు శ్రీను సోషల్ మీడియాలో బాహాటంగానే ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానంపై ఓ వీడియోను విడుదల చేశారు. పాదగయలో జరిగిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు సంబ ంధించి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, జనసేన నాయకులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కానీ టిడిపి నేతలకు పిలుపు రాకపోవడంతో దీనిపైనా వారు గుర్రుగా ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జనసేన అధికారికంగా జరిపే కార్యక్రమాలకు టిడిపికి ఎటువంటి సమాచారం ఉండకపోవడంతో టిడిపిని పూర్తిగా విస్మరించారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న వర్మ మౌనం వెనుక కారణం ఏంటి అన్న చర్చ స్థానికంగా కొనసాగుతోంది.. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చినా కంగారు పడకండి అన్న సమాధానమే వినిపిస్తోందట.. అయితే అధిష్టానం కూడా వర్మ మాటను పట్టించుకోవడం మానేసిందా.. సమస్య నేరుగా డిప్యూటీ సీఎం పవన్‌ది కావడంతో టిడిపి అధిష్టానం లైట్ తీసుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ప్రభుత్వ కార్యక్రమాలకు వర్మను పిలిచే విషయంలో కాస్త ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

# ఎదురుదాడి రాజకీయాల్లో ఆరితేరిన ఘనులు..!

రెండు తెలుగు రాష్ట్రాల్లో విపక్ష రాజకీయ పార్టీల విన్యాసాలు చూస్తుంటే అసహ్యం కలగక మానదు. తప్పులెన్నువారు తమ తప్పులు ఎరగరనే సామెత వీరికి సరిపోతుంది. ఐదేళ్ల పాటు జగన్, పదేళ్ల పాటుకెసిఆర్ కుఉంబం దోచుకుంది. నిజానికి విభజన వీరిద్దరి కోసమే జరిగిందా అన్నట్లుగా పరిస్థితి వచ్చింది. ఈ రెండు కుటుంబాలు, వీరిని నమ్ముకున్ కొందరు బాగు పడ్డారు.కానీ రెండు రెండు రాష్ట్రాలు దివాళా తీసాయి. వీరు గతంలో ఎలా పాలించారో ఇప్పటికే ప్రజలకు అర్థం అయ్యింది. అప్పులు చేసి, రాజభోగం అనుభవించి, రాష్ట్రాలను దివాళా తీయించారు. భూములను ఆక్ర మించి, వరదలకు కారణమయ్యారు. బలవంతంగా భూములను లాక్కున్నారు. ఒక్కో పథకంలో కోట్ల రూపాయలను దోచుకున్నారు. వీటిపై చర్యలు లేవు. నిలదీసే వారు లేరు.మళ్లీ అధికారం తమదేఅని ఎదురుచూస్తు న్నారు. ఓమూడేళ్లు ఓపిక పడితే మళ్లీ మనదే సామ్రాజ్యం అన్న ధీమాలో ఉన్నారు. అప్పటి వరకు తమ అవినతి బయటపడకుండా ఇప్పుడున్న ప్రభుత్వాలపై ఎదురుదాడి చేసి, ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇలా చెప్పు కుంటూ పోతే ఒక్కటేమిటి..అనేక అవలక్షణాలు కనిపిస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో జగన్,కెసిఆర్ పాలనలు ఒకే తరహాలు నియంతల్లాగా సాగా యి. ప్రజలను పురుగుల్లాగా చూశారు. ప్యాలెస్‌లు వీడి ప్రజల్లోకి రా లేదు. ఇప్పటికీ ప్యాలెస్‌లు వీడిప్రజల్లోకి రావడం లేదు. మరోమూడేళ్లు ఆగితే ..ప్రజలేమళ్లీ దిక్కులేక ఓట్లేస్తారన్న ధీమాలో ఉన్నారు. అందుకు ఇప్పుడున్న ప్రభుత్వాలపై బురదజల్లే పని ఉధృతంగా సాగించాలన్న ధోరణిని కొనసాగిస్తున్నారు. అందుకేఇప్పుడు బురద రాజకీయాల్లో అటు వైకాపా, ఇక్కడ బిఆర్ఎస్ ఆరితేరింది. బురదలో ప్రజలను ఆదుకోవాలన్న సోయి లేకుండా చేస్తున్న విమర్శలు సిగ్గుచేటు కాక మరోటి కాదు. తమకు తప్ప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగే అర్హత మరెవరికీ లేదన్న భావనలో అటు జగన్, ఇటు కెసిఆర్ ఉన్నారు. తామే మంచి పాలకులమని, ఇప్పుడున్న ప్రభుత్వాలదే బాధ్యతని గగ్గోలు పెడుతున్నారు. ప్రజలంతా ఇప్పుడు మళ్లీ కెసిఆర్ రావాలని, జగన్ కావాలని గగ్గోలు పెడుతున్నారని బాకా పత్రికల్లో రాసుకుంటున్నారు. ఇలా వారికి వారే నమ్ముతున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతున్నట్టుగానూ, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నట్లుగానూ ప్రచారం చేసుకున్నారు. బాకా పత్రికలు ఆహో ఓహో అన్నట్లు రాస్తూ వచ్చాయి. అలాంటి రాష్ట్రాల్లో ఇప్పుడు అంతా అధ్వాన్నంగా అయినట్టుగా కనిపిస్తోందని కూడా ప్రచారం చేసుకుంటున్నారు. వారి మీడియా ప్రచారం చేసే కథనాలను అనుచరగణం ప్రచారంలో ముందుకు తీసుకుని పోతోంది. సోషల్ మీడియాలో హద్దూపద్దూ లేకుండా విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయాలు ఇవే. తెలంగాణలో ఇద్దరు కెసిఆర్ కుటుంబ సభ్యులు రోజూడజన్ల కొద్దీ ఆరోపణలు చేస్తున్నారు. ఏదైనా మంచి జరిగిందని చెప్పరు. హైడ్రా మంచిని చెప్పరు. మూసీ ప్రక్షాళన తప్పంటారు. ఎరువులు కేంద్రం పంపకుండా ఉంటే అదీ ఇక్కడి ప్రభుత్వాల తప్పంటారు. ఇలాంటి సుద్దపూసలు ప్రజల గురించి కన్నీరు కారుస్తున్నారు. ఇక ఎపిలోకూడా సిఎం చంద్రబాబుకు పనీపాటా లేదన్నట్టుగా ప్రజల్లో తిరుగుతున్నాడని జగన్ భావిస్తున్నారు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతున్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులు కూడా అలాగేఅంటున్నారు. కెసిఆర్ తరఫున కెటిఆర్, హరీష్ రోజూ గొంతు చించుకుంటున్నారు. జగన్‌కు మాత్రం ఆయనే గొంతు చించుకోవాల్సి వస్తోంది. అడపాదడపా ఆయన అనుంగు సహచరులు సజ్జల, అంబటి, పేర్ని నాని వంటి వారు గళమెత్తున్నారు. గత తమ పాలనలో జరిగిన అక్రమాలు ప్రజలకు కొనే తెలుసు. ఎన్ని జరిగాయో ఎలా దోచుకున్నారో వారికే బాగా తెలుసు. ఈ నేపథ్యంలో అత్మపరిశీలన చేసుకోవాల్సిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఆత్మవంచన చేసుకుంటున్నారు. వరదలొస్తే రాజధాని అమరావతి మునిగి పోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించేప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే బాగుండన్న భావనలో ఉన్నారు. నిత్యం తాము చెప్పే అబద్దాలను కొందరైనా నమ్మకపోతారా అన్నది ఈ రెండు పార్టీల నేతల భావనగా ఉంది. అందుకే రెండు రాష్ట్రాల్లో ఒకే తరహా ప్రచారం సాగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు కూడా వీరి పాలన ఒకే తరహాలో అంటే నిరంకుశం గా సాగింది. దివి నుంచి దిగివచ్చిన నేతలుగా ప్రచారం చేసుకున్న తెలుగు వల్లభులుఇప్పుడు అదే కోమాలో ఉంటున్నారు. గతంలో అలా నమ్మడం వల్లనే ప్రజలు ఆ ఇద్దరు నేతలకు అధికారం కట్టబెట్టారు.

## మార్కెట్ ఈ కాయలు ఎక్కడ కనిపించినా సరే..
# విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి..

మార్కెట్‌లో మీరు అనేక రకాల కూరగాయలను చూస్తుంటారు. వాటిల్లో చౌ చౌ కూడా ఒకటి. వీటినే కయోట్ స్క్వాష్ అని కూడా పిలుస్తారు. తెలుగులో సీమ వంకాయలని అంటారు. ఇవి చూసేందుకు ఒక రకమైన జామకాయలను పోలి ఉంటాయి. అయితే ఇది కూరగాయ రకానికి చెందినది. దీన్ని కూరగా చేసుకుని తింటారు. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. ఈ క్రమంలోనే సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. 1 కప్పు ఉడకబెట్టిన సీమ వంకాయలను తింటే సుమారుగా 39 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 9 గ్రాములు, ప్రోటీన్లు 2 గ్రాములు, కొవ్వు 0.5 గ్రాములు, ఫైబర్ 4 గ్రాములు లభిస్తాయి. అలాగే వీటిలో విటమిన్లు బి9, సి, కె, బి6, మాంగనీస్, కాపర్, జింక్, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్, ఫాస్ఫరస్, క్యాల్షియం కూడా ఉంటాయి. ఇవి మనకు పోషణను అందిస్తాయి.

**గుండె ఆరోగ్యానికి..:** సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక యాంటీ ఆక్సిడెంట్లను పొందవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి లభిస్తుంది. ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు కూడా వీటిల్లో ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. తరచూ వీటిని తింటుంటే క్యాన్సర్, గుండె జబ్బులు, నాడీ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది.

వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. బీపీ నియంత్రణలోకి వస్తుంది. వీటిల్లో ఉండే ఫ్లేవనాయిడ్స్ రక్త నాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా చూస్తాయి.

దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

**డయాబెటిస్ ఉంటే..:** సీమ వంకాయల్లో పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల



వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఇది షుగర్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే విషయం. వీటిని తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. సీమవంకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటే పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. ఇవి ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. సాధారణ జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.

**బరువు తగ్గేందుకు..:** సీమ వంకాయల్లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పైగాఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు సీమ వంకాయలను తరచూ తింటుంటే బరువును తగ్గించుకోవచ్చు. వీటిని తింటే గర్భిణీల కు సైతం ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ కాయల్లో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇదిగర్భంలో ఉన్నశిశువుఎదుగుదలకు సహాయ పడుతుంది. కనుక గర్భిణీలు వీటిని తరచూ తినాలి. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు చాలా శక్తివంతంగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇలా సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను

# వర్షాకాలం నీరు తాగడం లేదా?

వర్షాకాలంలో సాధారణంగా దాహం చాలా తక్కువగా ఉంటుంది. దీంతో చాలా మంది నీరు తక్కువగా తాగుతారు. అయితే ఈ అలవాటును వెంటనే మార్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. దాహం వేయకుండా నీరు తాగే అలవాటు ఆరోగ్యాన్ని కాపాడుతుందని సూచిస్తున్నారు. వర్షాకాలంలో తాగే నీటి పరిమాణం తగ్గితే అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందనీ చెబుతున్నారు.

మలబద్ధకం : శరీరంలో తగినంత నీరు లేకపోతే మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి.

ఇందుకు సరైన మందులు సకాలంలో తీసుకోకపోతే, మూలశంక వంటి వ్యాధులు వస్తాయి. అంతే కాదు వర్షాకాలంలో తక్కువ నీరు తాగడం వల్ల జీర్ణ సమస్యలు కూడా వస్తాయి.

శరీర బలహీనత : ప్రతిరోజూ ఉత్సాహంగా పనిచేయాలంటే శరీరానికి తగినంత శక్తి అవసరం. దీనికోసం క్రమం తప్పకుండా నీరు తాగడం చాలా అవసరం. లేకపోతే చిన్న చిన్న పనులు చేసినా త్వరగా అలసిపోతారు.

మూత్రపిండాల సమస్యలు : సాధారణంగా మూత్రపిండాలు మన శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి సహాయపడతాయి. కానీ శరీరంలో నీటి కొరత ఉంటే, అది మూత్రపిండాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

చర్మ సమస్యలు : ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. శరీరంలో నీటి శాతం తగినంతగా లేనప్పుడు చర్మం దాని మెరుపును కోల్పోతుంది. ముఖంలో ప్రకాశం కూడా తగ్గుతుంది. దీనితో పాటు మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలు కూడా ప్రారంభమవుతాయి. తగినంత నీరు తాగే అలవాటు చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. అదేవిధంగా చర్మం పొడిబారడం వంటి సమస్యలను తగ్గిస్తుంది.మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు : శరీరంలో నీటి స్థాయి తగ్గితే మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే, ఎక్కువ నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మ్యాచింగ్ అదుర్స్ కదూ!




మహిళల అలంకరణలో మ్యాచింగ్‌ది ప్రత్యేకస్థానం. వేసుకున్న దుస్తుల రంగు, డిజైన్‌కి సరిపోయే ఆభరణాలు, గాజులు, బొట్టు, బ్యాగు,చెప్పులు.. ఇలా ఒక్కటేమిటి ప్రతీది మ్యాచింగ్ ఉండేలా ప్లాన్ చేసుకుంటారు ఫ్యాషన్ ప్రియులు. పెళ్లిళ్లు, వ్రతాలుఅనగానే ముందుగా మదిలో మెదిలేది అందమైన దుస్తులు, వాటికి సరిపోయే ఆభరణాలే! కానీ అన్నిసార్లూ అన్ని దుస్తులకు సరిపోయే నగలను ఎంచుకునే వీలు కుదరదు. అలాంటి ఇబ్బంది లేకుండా దుస్తులపైనే ఆభరణాలను జోడించిన ప్రత్యేక డిజైన్లు మార్కెట్లోకి వచ్చేశాయి. ప్రత్యేకంగా అలంకరించుకునే పనిలేకుండా దుస్తులతోపాటే ఒంటిమీద ఒదిగిపోయే ఈ డిజైనర్ ఆభరణాల విశేషాలేంటో తెలుసుకుందాం.. ఈ డిజైనర్‌వేర్ జువెలరీ సంప్రదాయ, సమకాలీన వస్త్రాలను ఆకర్షణీయంగా మార్చడమే కాక, ధరించే వారి సౌలభ్యాన్ని కూడా పెంచుతున్నాయి. ఆధునిక మగువలను ఆకర్షించేలా డిజైనర్లు దుస్తులపైనే ఆభరణాల్లా కనిపించేలా ప్రత్యేక డిజైన్లను రూపొందిస్తున్నారు. లెహెంగాలు, చీరలు, అనార్కలీ సూట్లు, ఇండో-వెస్ట్రన్ గౌన్లు వంటి వాటిపై మెటల్ బీడ్స్, కుందన్ రాళ్లు, ముత్యాలు, సీక్విన్స్, జరీ వర్క్ వంటి వాటిని ఉపయోగించి అందమైన ఆభరణాల రూపాన్ని సృష్టిస్తున్నారు. వీటిని ధరించినప్పుడు, సాధారణ స్టడ్స్, డెలికేట్ బ్రాస్‌లెట్స్ ఉంటే చాలు, భారీ ఆభరణాల అవసరం లేదు. వాయిలా, కల్కి ఫ్యాషన్ వంటి బ్రాండ్లు ఈ డిజైనర్ దుస్తులను ఎక్కువగా తయారుచేస్తున్నాయి. వీరి కలెక్షన్స్‌లో కనిపించే కుందన్, పెర్ల్, ఆక్సిడైజ్డ్ మెటల్ డిజైన్లు సంప్రదాయ వస్త్రాలకు రాజసాన్ని జోడిస్తున్నాయి. వీటిని చాలామంది వెడ్డింగ్‌వేర్‌గా ఎంచుకుంటున్నారు. ఆధునిక ఇండో-వెస్ట్రన్ గౌన్లు, జంప్‌సూట్స్, కాక్‌టెయిల్ డ్రెస్‌లలో కూడా ఈ డిజైన్ల ప్రభావం ఎక్కువగానే ఉంది. మీరూ ఓసారి ట్రై చేసి చూడండి మరీ!

## ఈ పండ్లు మీకు ఎక్కడ కనిపించినా సరే..
# విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి

సూపర్ మార్కెట్‌లలో లేదా బయట పండ్ల దుకాణాల్లో మనకు అప్పుడప్పుడు కొన్ని చిత్రమైన పండ్లు దర్శనమిస్తుంటాయి. అలాంటి పండ్లలో మాంగోస్టీన్ పండ్లు కూడా ఒకటి చూసేందుకు పత్తికాయల ఆకారంలో ఉంటాయి. లోపలంతా తెల్లని గుజ్జు మెత్తగా క్రీమ్‌లాగా ఉంటుంది. ఇది తియ్యని, పుల్లని రుచిని కలిగి ఉంటుంది. అయితే ఈ పండ్లను చాలా మంది చూసి ఉండరు. కానీ మనకు అప్పుడప్పుడు కనిపిస్తుంటాయి. వాస్తవానికి ఈ పండ్లను పోషకాలకు గనిగా చెబుతారు. ఈ పండ్లను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. ఈ పండ్లలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఈ పండ్లలో ఉంటాయి. కనుక ఈ పండ్లు కనిపిస్తే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. వీటి వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని అంటున్నారు.

సీజనల్ వ్యాధులకు చెక్..: మాంగోస్టీన్ పండ్లలో జాంతోన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంక వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ పండ్లలో ఉండే జాంతోన్స్, ఆల్ఫా మాంగోస్టిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరం లోపల, బయట ఉండే వాపులను తగ్గించుకోవచ్చు. గుండె జబ్బులు, క్యాన్సర్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మాంగోస్టీన్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

గుండె ఆరోగ్యానికి..: ఈ పండ్లలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు గుండె ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. ఈ పండ్లను తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ లెవల్స్, ట్రై గ్లిజరైడ్స్ స్థాయిలు తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల



రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. ఈ పండ్లలో పొటాషియం కూడా అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీ తగ్గేలా చేస్తుంది. అందువల్ల హైబీపీ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు ఈ పండ్లను తరచూ తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ పండ్లలో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు రోజూ ఈ పండ్లను తినాలి.

క్యాన్సర్ రాదు..: మాంగోస్టీన్ పండ్లలో ఉండే జాంతోన్స్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ క్యాన్సర్ గుణాలను సైతం కలిగి ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో తేలింది. ఈ పండ్లను తింటుంటే క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకోవచ్చు.

దీని వల్ల పలు రకాల క్యాన్సర్లు రాకుండా ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని రక్షిస్తాయి. వాపులకు గురికాకుండా చూస్తాయి. మొటిమలు, గజ్జి, తామర వంటి చర్మ సమస్యలు నయమవుతాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి కనుక వీటిని తింటే ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా ఈ పండ్లను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# జామతో ప్రయోజనాలు జమ



ఈ కాలం విరివిగా దొరికే జామకాయలను తినడం వల్ల ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయి. అయితే రోజుకు ఎంత మోతాదులో వీటిని తినాలి? అనే దానిపై చాలామందికి స్పష్టత లేదు. పోషకాహార నిపుణుల సలహా ప్రకారం రోజుకి 100 గ్రాముల జామ కాయలు లేదా పండ్లను తినవచ్చు. అంతకు మించితే జీర్ణ సమస్యలు వస్తాయి. మితంగా జామకాయలను తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి.

డయాబెటిస్ ఉన్నవారికి..: జామకాయలు లేదా పండ్లు పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే పోషకాహార లోపం తగ్గుతుంది. ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది.

రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. జామ పండ్లను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీని వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్దకం తగ్గుతుంది.

షుగర్‌తో బాధపడేవారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి.

గుండె ఆరోగ్యానికి.. : జామకాయల్లో పొటాషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటుని నియంత్రిస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే చర్మ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. ఆక్సీకిరణ ఒత్తిడి తగ్గి, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. జామకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కాయలను తింటే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి.

రోగ నిరోధక వ్యవస్థకు..: జామకాయలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచిఉపశమనం లభిస్తుంది.జామకాయలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. గులాబి రంగులో ఉండే జామకాయల్లో విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

# తడి వేళ.. పొడిగా ఉంచుదాం!

వానాకాలం వచ్చిందంటే.. పెద్దల సంగతేమో కానీ, పసిపిల్లలకు మాత్రం పరీక్షే! హాయిగా అమ్మ ఒడిలో ఆడుకోవాల్సిన చిన్నారులు వాతావరణ మార్పుల వల్ల తీవ్రమైన ఇబ్బందులకు గురవుతుంటారు. వాతావరణంలో తేమ, పొడిబారని దుస్తుల కారణంగా వారి శరీరంపై దద్దుర్లు తలెత్తుతాయి. కొందరు చిన్నారుల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఈ సమయంలో తల్లిదండ్రులు తమ చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. వానాకాలంలో పిల్లలు వెచ్చగా, హాయిగా గడపాలంటే ఈ కింది జాగ్రత్తలు తప్పక పాటించాల్సిందే.. వానాకాలంలో చిన్నారులకు రెండుపూటలా స్నానం చేయించాలనే ఆరాటం వద్దు. ఇలా రెండు పూటలా స్నానం చేయిస్తే చర్మంపై ఉండే సహజ నూనెలు తొలగిపోయి.. చర్మం పొడిబారుతుంది. రోజుకు ఒకసారి గోరువెచ్చని నీటితో తక్కువ సమయం స్నానం చేయించండి. సబ్బు రుద్దేయకుండా.. సహజ ఉత్పత్తులతో స్నానం చేయిస్తే మంచిది. క్రీములు వాడటం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోయి, బిడ్డ ఇబ్బందిపడతాడు. వాటికి బదులుగా నెయ్యి, బాదం నూనె, అలివ్ అయిల్ లాంటి వాటిని తక్కువ మోతాదులో అప్లయ్ చేయండి. ఇలా చేయడం వల్ల బిడ్డ చర్మం మృదువుగా తయారవుతుంది. వానాకాలంలో పిల్లలకు వాడే టవల్స్, దుస్తులు బ్యాక్టీరియాకు



ఆవాసాలుగా ఉంటాయి. వాటినుంచి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడేందుకు సురక్షితమైన లాండ్రీ వాష్‌నే వాడాలి. వాటిని సూర్యరశ్మిలో ఆరబెట్టడం వల్ల తాజాగా ఉండటంతో పాటు క్రిమిరహితంగా మారుతాయి. తడి కారణంగా డైపర్ మార్చిన తర్వాత కూడా చర్మం ముడతల్లో కొంత తేమ మిగిలే ఉంటుంది. కొత్త డైపర్ వేసేముందు బిడ్డ చర్మాన్ని సున్నితంగా తుడిచి పూర్తిగా పొడిగా మారిన తరువాత వేయాలి. లేదంటే తడి ప్రదేశంలో దద్దుర్లు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఒకవేళ దద్దుర్లు వచ్చినా జింక్ ఆక్సైడ్ ఉన్న సహజ పదార్థాలతో కూడిన డైపర్ రాష్ క్రిమ్ వాడటం మంచిది.

# భగ్గుమన్న లడఖ్.. రాష్ట్రహోదా కోసం ఆందోళనలు..

కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్ నిరసనలు చెలరేగాయి. రాష్ట్రహోదా డిమాండ్ చేస్తూ లేహ్ నగరంలో పెద్ద ఎత్తున ఆందోళ నకారులు రోడ్డుపైకివచ్చారు. వారిని చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో ఘర్షణకు దిగారు. అధికారులపై రాళ్లు రువ్వారు. భాజపా కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2019, ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు గా విభజించింది. తర్వాతనుంచి రాష్ట్రహోదా పునరు ద్ధరణకోసం ఎప్పటినుంచో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రహో దా, రాజ్యాంగపరమైన భద్రతలు కల్పించాలన్న డిమాండ్‌తో ఆందోళనకారులు ఉదయంలేహ్ వీధుల్లోకి వచ్చారు. తర్వాత ఆనిరసనలు హింసాత్మకంగామారడంతో రాళ్లురువ్వడం,భాజపా కార్యాలయం, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డా రు. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు బా ష్పవాయువును ప్రయోగించారు. అక్కడ ఇలాంటి ఘటన చోటుచేసు కోవడం ఇదే తొలిసారి. ప్రజల డిమాండ్లపై చర్చించేందుకు లద్దాఖ్ ప్రతినిధులు అక్టోబర్ 6నసమావేశానికి రావాలంటూ కేంద్రం ఆహ్వా నించిన సమయంలోఈ ఆందోళనలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. రాష్ట్ర హోదాకోసం పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ రెండువారాలుగా నిరాహార దీక్షచేస్తున్నారు.

లద్దాఖ్‌నుఆరవ షెడ్యూల్ కిందచేర్చాలని ఆయన డిమాండ్ చేస్తున్నా



రు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనను అక్కడి ప్రజలు మూడేళ్లుగా నిరసిస్తు న్నారు. తమ భూమి, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం రాజ్యాంగ భద్రత ఉండాలని కోరుతున్నారు. వారిడిమాండ్లపై కేంద్రంఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఇరువర్గాలమధ్య చర్చలు జరిగినా ఆశించిన ఫలితం రాలేదు. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 6న చర్చలకు రావాలని పిలుపు వచ్చింది.

# పహల్గాం దాడి కేసులో ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి అరెస్టు



శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి కేసులో ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పర్యాటకులపై దారుణానికి ఒడిగట్టిన ముష్కరులకు రవాణా సౌకర్యం కల్పించినందుకు గానూ అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన మహ్మద్ యూసఫ్ కటారి (26)గా గుర్తించారు. ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న పర్యాటకులే లక్ష్యంగా పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. అందులో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు టెర్రరిస్టులను ఈ ఏడాది జులై 29న 'ఆపరేషన్ మహదేవ్'లో మన భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. అందులో సులేమాన్ అలియాస్ అసిఫ్‌ను ఈ ఘటనకు మాస్టర్‌మైండ్‌గా గుర్తించారు. మరో ఇద్దరిని జిబ్రాన్, హమ్జా అఫ్గానీగా గుర్తించారు.

# హెచ్1బీ వీసా ఫీజుల వేళ.. భారత నిపుణులకు జర్మనీ పిలుపు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: హెచ్1బీ వీసా ఫీజును అమెరికా ప్రభుత్వం లక్ష డాలర్లకు పెంచడం పెను సంచలనమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలు దేశాలు భారతీయ నిపుణులను ఆకర్షించే పనిలో పడ్డాయి. అందులోభాగంగా నైపుణ్యం కలిగిన భారతీయులను తమ దేశంలోకి ఆహ్వానిస్తూ భారత్‌లోని జర్మనీ రాయబారి ఫిలిప్ అకెర్‌మన్ పోస్టు పెట్టారు. 'అత్యంత నైపుణ్యం కలిగిన భారతీయులందరికీ ఇది మా ఆహ్వానం. జర్మనీ దాని స్థిరమైన వలస విధానాలను కలిగిఉంది. దీంతో పాటు ఐటీ, సైన్స్, సాంకేతిక రంగాల్లో భారతీయులకు మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. మా దేశంలో పనిచేసే భారతీయులు జర్మన్‌ల కంటే ఎక్కువగా సంపాదిస్తున్నారు. అధిక వేతనాలతో వారు జర్మనీ సంక్షేమానికి ఉపయోగపడుతున్నారు. మేము హార్డ్‌వర్క్, ఉత్తమమైన వ్యక్తులకు మంచి ఉద్యోగం ఇవ్వడం అనేదాన్ని నమ్ముతాం' అని ఫిలిప్ పేర్కొన్నారు. ఈసందర్భంగా జర్మనీ వలస విధానం సరళంగా, ఆధునికంగా ఉందన్నారు. తమ విధానాల్లో ఆకస్మిక మార్పులు ఉండవన్నారు. ఈ క్రమంలోనే మంచి ఉద్యోగాల కోసం భారతీయులు తమ దేశానికి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా..

## తోసిపుచ్చిన న్యాయస్థానం

దిగ్గజ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మీడియా సంస్థ 'ఎక్స్'కు కర్ణాటక హైకోర్టులో చుక్కెదురైంది . సమాచారాన్ని బ్లాక్ చేయాలని ప్రభుత్వ అధికారులు ఉత్తర్వులు ఇచ్చే అధికారాన్ని 'ఎక్స్' కోర్టులో సవాలు చేసింది. ఆ పిటిషన్‌ను తాజాగా ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. భారత్‌లో ఎలాంటి నియంత్రణలేకుండా సోషల్ మీడియా సంస్థలు కార్యకలాపాలు నిర్వహించడానికి అనుమతి ఉండదని స్పష్టంచేసింది. అమెరికా న్యాయ తార్కికతను ఇక్కడకు తీసుకురావొద్దని హెచ్చరించింది. ఐటీ చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ కేంద్రప్రభుత్వంపై కొన్నినెలల క్రితం దావా వేసింది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(b)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం.. బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని, సెక్షన్ 69Aని పక్కదారి పట్టించడానికి అధికారులు



ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇరు పక్షాల వాదలను విన్న తర్వాత కోర్టు తీర్పు వెలువడింది.

# డ్రోన్ యుద్ధాలకు భారత్ సన్నద్ధం..!

ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల ప్రమేయం పెరిగిన నేపథ్యంలో భారత సైనిక దళాలు దీనిపై దృష్టిపెట్టాయి. ఈ అంశానికి సంబంధించి తమ సామర్థ్యాలను పరీక్షించుకునేందుకు అక్టోబరు 6 నుంచి 10 వరకూ భారీ విన్యాసాలను నిర్వహించనున్నాయి. సమీకృత రక్షణ విభాగం (ఐడీఎస్) ఆధ్వర్యంలో జరిగే ఈ యుద్ధక్రీడల్లో భారత అమ్ములపొదిలో ఉన్న డ్రోన్లు, శత్రు డ్రోన్లను నేలకూల్చే వ్యవస్థలను పరీక్షించనున్నారు. పాకిస్థాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' చేపట్టాక త్రివిధ దళాల భాగస్వామ్యంతో జరుగుతున్న తొలి సైనిక విన్యాసమిదే. మధ్యప్రదేశ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది. గగనతల రక్షణ వ్యవస్థలపై మంగళవారం దిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఐడీఎస్ ఉప అధిపతి ఎయిర్ మార్షల్ రాకేశ్ సిన్హా ఈ విషయాన్ని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో నేర్చుకున్న పాఠాలను ఆయన వివరించారు. సైనిక వ్యూహాలు, ప్రణాళికల్లో శత్రువు కన్నా ముందంజలో ఉండాలన్నారు.

# అమెరికాకు 58-శాతం తగ్గిన భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు..!

భారత నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఈ సుంకాల ప్రభావం భారత్‌లో తయారైన వస్తువులపై ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. ఓ కొత్త నివేదిక భారత టెక్ పరిశ్రమలో ఆందోళనలను రేకెత్తించింది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ భారతదేశం నుంచి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు గణనీయంగా తగ్గాయని.. ఈ ఏడాది మే- ఆగస్టు మధ్య 58శాతం తగ్గిందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ నివేదిక పేర్కొంది. మే 2.29 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ స్మార్ట్ ఫోన్ ఎగుమతులు ఆగస్టులో కేవలం 964.8 మిలియన్లకు పడిపోయాయి. జూన్‌లో ఎగుమతులు 2 బిలియన్లు, జూలైలో 1.52 బిలియన్లకు తగ్గగా.. ఆగస్టు నాటికి భారీగా తగ్గాయి. జీటీఆర్ఐ దీన్ని ఆందోళనకరమైన పరిస్థితిగా పేర్కొంది.స్మార్ట్‌ఫోన్లపై కొత్త సుంకాలు విధించినందున ఈ తగ్గుదలను వెంటనే దర్యాప్తు చేయాలని పేర్కొంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఆగస్టులో కొన్ని ఉత్పత్తులపై సుంకాలు విధించారు. ఈ సుంకాలు మొదట్లో 10శాతంగా ఉండగా.. ఆగస్టు 27 నాటికి 25శాతానికి పెరిగాయి. ఆగస్టు 28 తర్వాత 50శాతానికి చేరుకున్నాయి. అయితే, ఈ సుంకాలు స్మార్ట్‌ఫోన్‌లకు కాకుండా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, సీఫుడ్, రసాయనాలు, సోలార్ ప్యానెల్స్




వంటి ఉత్పత్తులకు వర్తిస్తాయి. అయినప్పటికీ, ఆగస్టు ఎగుమతుల్లో 28.5శాతం వాటా కలిగి ఉన్న సుంకం లేని ఉత్పత్తులు కూడా 41.9శాతం గణనీయమైన తగ్గుదలను చవిచూశాయి. ఈ కొత్త సుంకాల పూర్తి ప్రభావం సెప్టెంబర్‌లో ఉంటుందని.. ఇది ఎగుమతుల్లో మరింత తగ్గుదలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఎగుమతులు తగ్గడం కేవలం సుంకాల వల్ల మాత్రమే కాదని.. వాటి వెనుక అనేక సవాళ్లు ఉండవచ్చని.. వాటిని పరిశోధించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది.

## ఒక్కనెలలో విశ్వరూపం! బంగారం, వెండి షాకింగ్ ధరలు




బంగారం, వెండి ధరలు ఒక్క నెలలోనే విశ్వరూపం చూపించాయి. రోజుల వ్యవధిలోనే అమాంతం పెరిగిపోయాయి. భారత్, బ్రెజిల్, రష్యా సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ఆంక్షలు, ఉక్రెయిన్, గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న ఘర్షణలతో సహా భౌగోళిక రాజకీయ ఆందోళనల మధ్య రిటైల్, ఫ్యూచర్స్ దేశీయ మార్కెట్లలో గత 30 రోజుల్లో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.6,000 పైగా పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో శుక్రవారం గోల్డ్ ఫ్యూచర్స్ 10గ్రాములకు రూ.1,07,740 వద్ద రికార్డు గరిష్టాన్ని తాకింది. ఆగస్టు 5న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,00,076 నుంచి రూ.6,06,338కు పెరిగినట్లు ఇండియన్ బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) తెలిపింది. ఈ వారంలోనే 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,845 పెరగ్గా, ఆగస్టు 18 నుంచి (రూ.99,623) 10 గ్రాములకు రూ.6,715 పెరిగింది. ఈ వారం, వెండి ధర సాపేక్షంగా స్థిరంగా ఉంది. సెప్టెంబర్ 1న రూ .1,22,800 నుండి రూ .370 పెరిగింది.

## టీవీఎస్ అపాచీ.. కొత్త వేరియంట్లు వచ్చాయ్..

ప్రఖ్యాత టీవీఎస్ మోటార్ సంస్థ తన ప్రధాన మోటార్ సైకిల్ టీవీఎస్ అపాచీకి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, అపాచీ ఆర్‌టీఆర్ 160, 180, 200, టీవీఎస్ అపాచీ ==310,==310 లైనప్‌లలో లిమిటెడ్-ఎడిషన్ వేరియంట్లను విడుదల చేసింది. లిమిటెడ్ ఎడిషన్ లైనప్‌లో ప్రత్యేకమైన బ్లాక్-షాంపైన్-గోల్డ్ లివరీ, డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్, యూఎస్‌బీ చార్జర్, మరెన్నో ఫీచర్లు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160, 200 లైనప్‌లలో అత్యున్నత స్థానంలో నిలిచే కొత్త 4 వీ వేరియంట్లు, అత్యాధునిక క్లాస్-డి ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, ఎల్ఈడీ డీఆర్ఎన్‌లు, ఆల్-ఎల్ఈడీ లైటింగ్, 5 అంగుళాల కనెక్టెడ్ టీఎఫ్‌టీ క్లస్టర్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, బోల్డ్ కొత్త రంగులు, డైనమిక్ గ్రాఫిక్స్ తదితర అదనపు ఫీచర్లు లభించాయి. ఈ సందర్భంగా టీవీఎస్ మోటార్ కంపెనీ డైరెక్టర్, సీఈవో కె.ఎన్. రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 6.5 మిలియన్ల టీవీఎస్ అపాచీ కమ్యూనిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



## భారత్‌లో చిన్న ఈవీ కార్లను తీసుకొస్తాం: ఫోక్స్‌వ్యాగన్ సీఈఓ




భారత్ మార్కెట్లో సరసమైన, చిన్న ఎలక్ట్రిక్ కార్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నామని ప్రముఖ కార్ల తయారీ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ అభిప్రాయపడింది. మెరుగైన వ్యూహంతోవాహనాలను తీసుకొచ్చేందుకు భాగస్వాములతో చర్చిస్తున్నామని కంపెనీ సీఈఓఆలివర్ బ్లూమ్ ప్రకటనలో తెలిపారు. మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభు త్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఇప్పటికే ప్రపంచంలో మూడో అతిపెద్ద వాహన మార్కెట్‌గా ఉన్న భారత్, మరింత ఆకర్షణీయంగా మారుతుంది. ఎలక్ట్రిక్‌చిన్న కార్ల విభాగంలో 'ఐడీ క్రాస్‌కాన్సెప్ట్ కింద కంపెనీ స్కోడా కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ ఎపిక్‌తో పాటు, పోలో, కుప్రా కార్లను తీసుకురానుంది. ఎలక్ట్రిక్ అర్బన్‌కార్ ఫ్యామిలీ కిందసరస మైనధరలో వివిధ బ్రాండ్లలో ఎంట్రీ లెవల్ ఎలక్ట్రిక్ కార్లపైనా పనిచే స్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగానే ఆయన భారత మార్కెట్‌పై ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ మార్కెట్ కోసం చిన్నఈవీ కార్లను తీసుకొస్తామని తెలిపారు. అయితే, ప్రీమియం, లగ్జరీ కార్ల విభాగంలోనూ అవకాశాలను వదులుకోమని స్పష్టం చేశారు.

## (ఎఫ్‌పీఐ) వెళ్లిపోతున్న విదేశీ నిధులు

భారతీయ స్టాక్ మార్కెట్లలో గత కొంతకాలంగా ప్రతికూల సెంటిమెంట్ కొనసాగుతోంది. ఫలితంగా మన మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను వెనక్కి తీసుకెళ్తున్నారు. డిపాజిటరీ డేటా ప్రకారం, సెప్టెం బర్ మొదటి వారంలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ. 12,257 కోట్ల విలువైన నిధులను ఉపసంహరించుకున్నారు. ఇందుకు ప్రధానంగా భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాలు, డాలర్ మారకం బలంగా ఉండటం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు కారణాలుగా ఉన్నాయి. గత నెలలో ఎఫ్‌పీఐలు రూ. 34,990 కోట్లను, అంతకుముందు జూలైలో రూ. 17,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2025లో ఇప్పటివరకు మొత్తం రూ. 1.43 లక్షల కోట్ల విదేశీ నిధులు మన ఈక్విటీల నుంచి వెళ్లాయని డిపాజిటరీ డేటా పేర్కొంది. రానున్న వారంలోనూ అమెరికా ఫెడ్ రేట్ల కోతపై వస్తున్న ఊహాగానలు, అమెరికా లేబర్ డేటా, ఆర్‌బీఐ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, భారత రూపాయి మారకం వంటి అంశాలు ఎఫ్‌పీఐల నిధుల ఉపసంహరణపై ప్రభావితం చూపుతాయని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఉద్యోగులకు భారతీయ రైల్వే గుడ్‌న్యూస్.. 78 రోజుల బోనస్




ఉద్యోగులకు భారతీయ రైల్వే తీపికబురు చెప్పింది. దీపావళి సందర్భంగా ఉద్యోగులకు 78 రోజుల ఉత్పత్తి ఆధారిత బోస్ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ మంగళవారం సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 10.91లక్షల మంది ఉద్యోగులకు రూ. 1865.68 కోట్ల బోనస్ చెల్లించనున్నది. ఈ సందర్భంగా కేంబినెట్ బిహార్‌లో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. తర్వలోనే బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. గతేడాది దాదాపు 11 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ఇచ్చింది. మోదీ ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు రూ.2,029 కోట్ల బోనస్‌ను ఆమోదించింది. అర్హత కలిగిన రైల్వే ఉద్యోగికి 78 రోజులకు గరిష్టంగా రూ.17,951 చెల్లించనున్నారు. ఈ మొత్తాన్ని వివిధ రకాల రైల్వే ఉద్యోగులకు ఇవ్వనున్నారు. ఇందులో ట్రాక్ మెయింటెయినర్లు, లోకోమోటివ్ పైలట్లు, రైలు మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్ సీ ఉద్యోగులు ఉన్నారు. 2024-25 సంవత్సరంలో రైల్వేల పనితీరు చాలా బాగుంది. రైల్వేలు రికార్డు స్థాయిలో 1614.90 మిలియన్ టన్నుల సరుకును.. దాదాపు 7.3 బిలియన్ల ప్రయాణికులను రవాణా చేశాయని ప్రభుత్వం తెలిపింది. నేషనల్ షిప్ బిల్డింగ్ మిషన్‌కు కేంద్ర మంత్రి కూడా ఆమోదం తెలిపారని వైష్ణవ్ వెల్లడించారు.

# జావా, యెజ్డి బైక్‌ల ధరలు తగ్గింపు..

క్లాసిక్ లెజెండ్స్ (సీఎల్) తమ జావా, యెజ్డి బైక్‌ల కొత్త ధరలను ప్రకటించింది. వీటిలో అడ్వెంచర్, రోడ్‌స్టర్, బాబర్ నుండి స్క్రాంబ్లర్ వరకు ఉన్నాయి. ఇప్పుడివి రూ .2 లక్షల లోపు అందుబాటులో ఉన్నాయి. పర్యావరణానికి పనికిరాదని భావించిన టూ స్ట్రోక్ మోటార్ సైకిల్ ను నిషే ధించిన విధాన మార్పు కారణంగా భారతదేశంలో జావా, యెజ్డీ అమ్మకాలను కంపెనీ గతంలో నిలిపివేసింది. అయితే జీఎస్టీ 2.0 సంస్కరణలతో, జావా, యెజ్డీ బైక్‌లు తిరిగి రోడ్లపైకి వస్తాయని కంపెనీ తెలిపింది. 350 సీసీ లోపు మోటార్ సైకిళ్లపై జీఎస్టీని తగ్గించి 18 శాతం పరిధిలోకి తీసురావడాన్ని స్వాగతిస్తున్నట్లు జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ తరేజా చెప్పారు.- 42 మోడల్ పాత ధర రూ.1,72,942 కాగా కొత్త ధర రూ.1,59,431 తగ్గింపు రూ.13,511- జావా 350 పాత ధర రూ.1,98,950, కొత్త ధర



రూ.1, 83,407, తగ్గింపు రూ.15,543- 42 బాబర్ పాత ధర రూ.2,09,500, కొత్త ధర రూ.1,93,133, తగ్గింపు రూ.16,367- 42 బాబర్ (ఇంకొక వేరియంట్) పాత ధర రూ.2,10,142, కొత్త ధర రూ.1,93,725,తగ్గింపు రూ.16,417-పెరక్ పాత ధర రూ.2,16,705, కొత్త ధర రూ.1,99,775, తగ్గింపు రూ.16,930

# సినిమా..

## వెంకటేశ్‌కు గోల్డెన్ ఫేజ్ స్టార్ట్..



టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేశ్ మరోసారి తన సూపర్ ఫామ్‌ను చూపిస్తూ తన కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ప్రారంభించారు. మూవీ మొఘల్ డి.రామానాయుడు వారసుడిగా 'కలియుగ పాండవులు'తో వెండితెరకి ఎంట్రీ ఇచ్చిన వెంకీ, కొన్ని సంవత్సరాలుగా ఫ్యామిలీ ప్రేక్షకుల మన్ననలు పొందుతూ తనదైన స్థానం సంపాదించుకున్నారు. గత కొంత కాలంగా సరైన హిట్ లేక కాస్త నిరాశలో ఉన్న వెంకటేశ్, 2025 సంక్రాంతికి విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బంపర్ హిట్ కొట్టి తిరిగి ట్రాక్‌లోకి వచ్చారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్, రూ.300 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి, తెలుగు సినిమా రికార్డుల్లో ఓ మైలురాయిగా నిలిచింది. ఈ సినిమాతో వెంకటేశ్ సీనియర్ హీరోల్లో ఈ స్థాయిలో కలెక్షన్లు రాబట్టిన తొలి నటుడిగా రికార్డ్ క్రియేట్ చేశారు. 'గుంటూరు కారం' సినిమాపై ఉన్న రూ.212 కోట్లు వసూళ్ల రికార్డును అధిగమించిన ఈ చిత్రం, 2025 సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. బ్లాక్‌బస్టర్ విజయంతో మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చిన వెంకటేశ్, ఇప్పుడు వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి హీరోగా, యువ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో ఓ కీలక పాత్ర కోసం వెంకటేశ్ అంగీకరించారు. ఈ సినిమా షూటింగ్‌ను అక్టోబర్ 20నుంచి ప్రారంభించబోతున్నారు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో కూడా వెంకటేశ్ ఓ ప్రాజెక్ట్ చేయనున్నారు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేయగా, ఇప్పుడిదే కాంబినేషన్ మళ్లీ తెరపైకి రానుంది. అక్టోబర్ 6 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమా పై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. అంతేకాదు, సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌కు కొనసాగింపుగా 'దృశ్యం 3' కూడా వెంకటేశ్ చేయనున్నారు. అదీ కాకుండా, నందమూరి బాలకృష్ణతో కలిసి ఓ మల్టీస్టారర్‌లో నటించడానికి కూడా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పలువురు యువ దర్శకులు కూడా వెంకటేశ్‌కు కథలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.


ఈ లైనప్ చూస్తుంటే, వెంకటేశ్ వచ్చే రెండు మూడేళ్లపాటు బిజీగా ఉండటంఖాయం అని చెప్పొచ్చు. హిట్ ట్రాక్‌లోకి వచ్చిన వెంకీ మళ్లీ తన సత్తా నిరూపించుకుంటూ కొత్త తరానికి కూడా కనెక్ట్ అవుతున్నారు. మాస్ యాక్షన్ బాటలో కాకుండా, ఫ్యామిలీ ఎంటర్టైనర్లలోనే తన స్పెషల్ స్టైల్‌తో కొనసాగుతూ వేర్వేరు జనరేషన్‌లలో ఫ్యాన్ బేస్ సాధిస్తూ తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు.

## నాకు ఏ కష్టం వచ్చినా ఫస్ట్ కాల్ అతనికే చేస్తా



మలయాళీ బ్యూటీ అయినప్పటికి కల్యాణి ప్రియదర్శన్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. హలో, చిత్రలహరి, రణరంగం సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ భామ, తాజాగా విడుదలైన 'కొత్త లోక'లో సూపర్ ఉమెన్ పాత్రతో అలరించింది. ఇంతవరకు ప్రధానంగా సరదా పాత్రలు చేసిన ఆమె, ఈ సినిమాలో తొలిసారి యాక్షన్ సీన్లలో కనిపించడం ప్రత్యేకం. అయితే ఇటీవల ఇంటర్వ్యూలో కల్యాణి తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఆమె మాటల్లో.. "మా స్వస్థలం కేరళ అయినప్పటికీ నేను చెన్నై లో పుట్టి పెరిగాను. అమ్మానాన్న ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే షూటింగ్ సెట్స్ వాతావరణం నాకు పరిచయం. అక్కడి నుంచే సినిమాలపై ఆసక్తి పెరిగింది. 2017లో 'హలో' ద్వారా టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టాను. అప్పటి వరకు ఎక్కువగా లైట్ హార్టెడ్ రోల్స్ మాత్రమే చేసాను. కానీ 'కొత్త లోక' కోసం నేను ఆరు నెలలు స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఇది నాకు కొత్త అనుభవం" అని చెప్పింది. అలాగే తన స్నేహితుడు దుల్కర్ సల్మాన్ గురించి మాట్లాడుతూ.. "సినీ ఇండస్ట్రీలో నాకు దుల్కర్ బెస్ట్ ఫ్రెండ్. నాకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా, లేదా ఏదైనా సలహా కావాలన్నా మొదటి ఫోన్ దుల్కర్‌కే చేస్తాను. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉంటారు" అని చెప్పి తన బంధాన్ని బయటపెట్టింది. కల్యాణి ప్రస్తుతం మలయాళం, తెలుగు సినిమాల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ, విభిన్న పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది.

## బ్లాక్ అండ్ వైట్ లుక్స్‌లో సామ్ మెస్మరైజ్



సమంత రూత్ ప్రభు ప్రతి సారి తన స్టైల్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు కూడా అదే రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. బ్లాక్ అండ్ వైట్ గౌన్‌లో కూల్ లుక్‌తో కనిపించిన సమంత, సింపుల్‌గా ఉన్నా స్టైలిష్‌గా నిలిచింది. మేకప్ మినిమల్‌గా, హెయిర్ లూజ్‌గా వదిలేసుకోవడం ఈ లుక్‌ను మరింత సహజంగా చూపించింది. సమంత కెరీర్ గురించి చెప్పాలంటే, 2010లో ఏ మాయ చేసావే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత దూకుడు, ఈగ, అత్తారింటికి దారేది, రంగస్థలం వంటి బ్లాక్‌బస్టర్‌లతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగుతో పాటు తమిళంలోనూ అగ్రశ్రేణి నటిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా ది ఫ్యామిలీ మాన్ 2 వెబ్ సిరీస్‌లో చేసిన పాత్ర ఆమెకు కొత్త గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇటీవలి కాలంలో ఆరోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కొంత విరామం తీసుకున్నా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంటుంది. తన ప్రయాణం, వర్కౌట్ క్లిప్స్, వ్యక్తిగత ఆలోచనలను షేర్ చేస్తూ అభిమానులతో అనుబంధం కొనసాగిస్తోంది. ఈ ఫోటోషూట్ కూడా ఆమె ఫ్యాషన్ సెన్స్, లైఫ్ స్టైల్‌పై ఉన్న క్లాస్‌ని మరోసారి చూపించింది. ఇక సమంత ప్రస్తుతం కొన్ని కీలక ప్రాజెక్ట్‌లలో నటిస్తోంది. శాకుంతలం తర్వాత ఆమె చేసిన ప్రయోగాలు మిశ్రమ స్పందన తెచ్చుకున్నా, రాబోయే చిత్రాలపై ఇంకా మంచి అంచనాలున్నాయి. బాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లపై కూడా ఆమె దృష్టి పెట్టింది. నటనతో పాటు బ్యూటీ, ఫిట్‌నెస్‌లలోనూ ఇన్స్పిరేషన్‌గా మారిన సమంత, అనేక మంది అభిమానులకి రోల్ మోడల్‌గా నిలుస్తోంది. మొత్తానికి, సమంత షేర్ చేసిన ఈ తాజా ఫోటోలు మరోసారి ఆమె లుక్‌ని హైలైట్ చేశాయి. ప్రస్తుతం ఆమె రక్త బ్రహ్మాండ అనే ప్రాజెక్టులో నటిస్తోంది.

### నెట్‌ఫ్లిక్స్‌లోనూ అదే దూకుడు..
## మహావతార్ నరసింహ ఉగ్రరూపం

హిందూ పురాణాల నేపథ్యంలో యానిమేటెడ్ సినిమాగా వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసింది 'మహవ తార్ నరసింహ' . కన్నడ టాప్ ప్రొడక్షన్ హౌస్‌లైన హొంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా తెరకెక్కించాయి. ప్రపంచవ్యాప్తంగా జూలై 25న థియేటర్లలో విడుదలై ఘన విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు వసూళ్లను రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ లో పలు భారతీయ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ లోనూ తన దూకుడు ప్రదర్శిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియాలో టాప్ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. ముందుగా అంతా ఊహించినట్టుగానే అద్భుతమైన వ్యూయర్‌షిప్‌తో డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా దండయాత్ర కొనసాగి స్తోంది. అశ్విన్ కుమార్ స్టోరీ టెల్లింగ్, సాలిడ్ విజువల్స్‌కు కుటుంబ ప్రేక్షకులు, చిన్నా రులు ఫిదా అయిపోతున్నారు. హిందూ పురాణాల లోని శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆధారంగా చేసుకుని ఏడు భాగాలుగా రూపొందించే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో ఫస్ట్ పార్టుగా వచ్చింది మహావతార్ నరసింహా. ఈ ఫ్రాంచైజీలో రాబోయే నెక్ట్స్ పార్టులపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

# విశాఖ స్టీల్‌కు క్యాప్టివ్ మైన్స్ ఎందుకు లేవు..?



దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయి. టాటా కంపెనీతో సహా అనేక ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు వంద సంవత్సరాలకు సరిపడా ఇనుప ఖనిజ గనులున్నాయి. కానీ ఒక్క విశాఖస్టీల్ ప్లాంట్‌కే గత 40 సంవత్సరాల నుండి ఉత్పత్తి జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించలేదు. ఒక టన్ను స్టీల్ తయారు చేయడానికి 1.6 టన్నుల ఇనుప ఖనిజం ఉండాలి. 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సాలీనా 10 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం అవసరం. సొంత గనులున్న స్టీల్ ప్లాంట్లు తమ గనుల నుండి తవ్వి తీసుకోవడానికి టన్నుకు సుమారు రూ.1000 లోపే అవుతుంది. కాని విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో కొనడం వల్ల టన్నురూ.8 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీని వల్ల సాలీనా సుమారు రూ.4 వేల కోట్లకు పైగా అదనంగా విశాఖ స్టీల్‌పై భారం పడుతున్నది. ఇంత తీవ్రమైన సమస్యను గత 40 సంవత్సరాల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించలేదు. 1990లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించింది. అదే కాలంలో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు భారతదేశంలో అమల్లోకి వచ్చాయి.

విశాఖస్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వారికి అమ్మాలనే విధానంతో నాటి నుండి నేటి వరకు సొంత గనులు సమకూర్చకుండా నిర్లక్ష్యం చేశాయి. 2014 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తమకు అనుకూలమైన కార్పొరేట్లకు కట్టబెట్టడానికి వడివడిగా ప్రయత్నిస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు త్యాగ గుణంతో రైతులు ఇచ్చిన 20 వేల ఎకరాల భూములు జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. దేశంలోని సముద్ర తీరంలో ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ విశాఖ స్టీల్‌ప్లాంట్. ఆధునికమైన యంత్రాలున్నాయి. నైపుణ్యం కలిగిన కార్మిక వర్గంఅత్యంత నాణ్యమైన స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే కార్పొరేట్ల కళ్లు ఇతర ఏ ఇతర స్టీల్‌ప్లాంట్ల మీద లేవు. ఒక్క విశాఖ స్టీల్ మీదే ఉన్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకులు స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని గట్టిగా మాట్లాడటం, అధికారంలోకొచ్చిన తర్వాత ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. 2009లో ఫిబ్రవరి 19 విశాఖ స్టీల్ యూనియన్లు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సొంత గనులు కోసం ధర్నా నిర్వహించారు. ఆనాడు ప్రతిపక్షంలోని చంద్రబాబు ఏ మాట్లాడారో చూద్దాం. "ఇది మేము పోరాడి సాధించిన ప్రాజెక్టు, మీరు అమ్మడానికి వీల్లేదు. ఇది పబ్లిక్ సెక్టార్‌లోనే ఉండాలి" అని గట్టిగా పోరాడాం. బిఐఎఫ్ఆర్ కు పోకుండా ఆపాము. మంచి లాభాలు సాధించింది. 4మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు విస్తరణ జరిగింది. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబులాపురం మైన్స్ ఇచ్చి ఉంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఏ సమస్య ఉండేది కాదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సార్, జిందాల్, పోస్కో, బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్‌లకు మైన్స్ కట్టబెట్టారు. కాని వారికి విశాఖ స్టీల్‌ప్లాంట్ జ్ఞాపకం రాలేదు. వారంతా డబ్బులిస్తారు. మనం ఇక్కడ డబ్బులు ఇవ్వలేము. కాబట్టే మైన్స్ ఇవ్వడం లేదు. ఎంత బాధాకరమో చూడండి తమ్ముళ్లూ" అని ఆయన బాధను వాపోయారు. ఇదే విధంగా అనేక సార్లు ఆనాటి అధికార పక్షాన్ని విమర్శిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం చంద్రబాబు మొసలి కన్నీరు కార్చారు. కాని, నేడు ఆర్సెలార్ మిట్టల్‌కు గనులు అడుగుతున్న చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం మైన్స్ అడగడం లేదు. ఈనాడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మరియు కేంద్ర ఎన్‌డిఏ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల మాట మాట్లాడకుండా అక్కడ పోరాడుతున్న ట్రేడ్ యూనియన్లపై దుమ్మెత్తిపోస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకాశం జిల్లాలోని 66 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి కేటాయించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ దరఖాస్తు చేసినా ప్రకాశం జిల్లాలోని కొణిజెడు, మర్లపాడు గ్రామాల్లోని 1307 ఎకరాల్లోని ఇనుప ఖనిజాన్ని విశాఖ స్టీల్‌కు కేటాయించలేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే గనులను జింపెక్స్ కంపెనీకి కేటాయించింది. ఆ కంపెనీ ఒక్క టన్ను కూడా తీయకుండా వెళ్లిపోయింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇనుప ఖనిజం కోసం దరఖాస్తు చేసినా కేంద్రం, రాష్ట్రం రెండూ గనులు కేటాయించడం లేదు. సొంత గనులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సమకూర్చితే విశాఖ స్టీల్ దేశంలోనే ఉత్పత్తిలోనూ, లాభాల్లోనూ ప్రథమ స్థానంలో ఉంటుంది. ప్రభుత్వ రంగంలో ఉన్నంత కాలం కేటాయించకుండా ఈ పరిశ్రమను నష్టాల్లోకి నెట్టి సిక్ పరిశ్రమగా ప్రకటించి ప్రైవేట్‌కు కట్టబెట్టాలనే దుర్మార్గమైన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఇటీవల కాలంలో స్టీల్‌శాఖ మంత్రిగా ఉన్న శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్ సొంత గనులపై వితండవాదం చేశారు. దేశంలో సొంత గనులు లేని పెద్ద పెద్ద కంపెనీలకు కూడా లాభాలు వస్తున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూడా గతంలో లాభాలు వచ్చాయని చెప్పడం వింతగా ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకున్నా 2000 సంవత్సరం వరకు ఇనుప ఖనిజం టన్ను రేటు రూ.500 లోపే ఉండేది. 2000 సంవత్సరం తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో అనేక మార్పులు వచ్చాయి. దాని ప్రభావంతో టన్ను ధర రూ. 8 వేలు పైగా పెరిగింది. మన దేశంలో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ మరియు రెగ్యులేషన్ చట్టం 1957, సెక్షన్ 17ఎ ప్రకారం అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించాలి. అందువల్లనే మన దేశంలోని భిలారు, బొకారో, దుర్గాపుర్, రూర్కెలా లాంటి ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలన్నింటికీ సొంత గనులు ప్రారంభం నుండే కేంద్ర ప్రభుత్వాలు కేటాయించాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఎన్నికైన స్టీల్ శాఖామంత్రి ఈ విషయం గురించి అడగడం చేతకాక వక్రవాదనలు చేయడం విడ్డూరంగా ఉంది. పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ దగ్గర భారీ బహిరంగ సభ నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు అడిగే ధైర్యం, దమ్ము ఆనాటి వైసిపి ప్రభుత్వానికి లేదని బల్ల గుద్ది విమర్శించారు. ఆనాటి ఎంపీలను ఉప్పు, కారం తిన్నారా? అని ప్రశ్నించారు. కాని ఈనాడు ఆయన ఉక్కు గనుల ఊసే మాట్లాడటం లేదు. అలాగే విశాఖ ఎంపీ శ్రీభరత్ కూడా మైన్స్ గురించి వక్రభాష్యాలు చెబుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఉన్నాయని అబద్ధాలాడుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని రిట్ పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ నర్సింహారెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. కానీ ఆ తీర్పు నేటికీ అమలుకు నోచుకోలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రకాశం జిల్లాలో సొంత గనుల కోసం అనేక దఫాలుగా దరఖాస్తు చేసినా రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వాలకు నేడున్న అవకాశాలు గతంలో ఏనాడూ లేవు. కూటమి ప్రభుత్వం మద్దతు లేకుండా కేంద్రబిజెపి ప్రభుత్వం ఒక్క రోజుకూడా కొనసాగలేదు. సొంత గనులు కేటాయించమని కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే ఖచ్చితంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు వస్తాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215